జేఈఈ మెయిన్స్‌లో మెరిశారు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ, ఎన్ఐటీ ప్రవేశాలకు సంబంధించి గత నెలలో నిర్వహించిన జేఈఈ సెక్షన్ 1 పరీక్షల్లో విశాఖ విద్యార్థులు ర్యాంకులు సాధించారు. ఈ ఫలితాలు మంగళవారం రాత్రి విడుదలయ్యాయి. "ఇప్పటి వరకు వచ్చిన ఫలితాల్లో విశాఖకు చెందిన బి.విక్రమ్‌రాజ్ 99.997, డీబీఎస్‌బీ ప్రసాద్ 99.994, హరిచరణ్ 99.98 పర్సంటైల్ సాధించారు. కార్పొరేట్, ప్రైవేట్ కాలేజీ విద్యార్థులు 90.0 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించారు. సెక్షన్ 2 పరీక్షలు ఏప్రిల్‌లో జరగనున్నాయి. రెండింటిలో ఉత్తమ పర్సంటైల్‌ను తీసుకొని జాతీయస్థాయి ర్యాంకులను ఖరారు చేస్తారు.

నామినేషన్లన్నీ ఓకే

- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు ముగిసిన నామినేషన్ల పరిశీలన
- 13న మధ్యాహ్నం 3 గంటల వరకు ఉప సంహరణకు అవకాశం
- మొత్తం ఓటర్లు 22,493 మంది
- పరిశీలకుడు ఎంఎం నాయక్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్



నామినేషన్లు పరిశీలిస్తున్న పరిశీలకుడు ఎంఎం నాయక్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పది మంది అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లు అధికారుల ఆమోదం పొందాయి. కలెక్టరేట్‌లో మంగళవారం నామినేషన్ల పరిశీలన ప్రక్రియ అనంతరం అభ్యర్థులందరి నామినేషన్లు సక్రమంగానే ఉన్నాయని ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.ఎన్. హరేంధర ప్రసాద్ ప్రకటించారు.

ఎన్నికల పరిశీలకుడు ముదావత్ ఎం నాయక్ ఆధ్వర్యంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మంగళవారం ఉదయం నామినేషన్ల పరిశీలన ప్రక్రియను నిర్వహించారు. ఈ స్థానానికి మొత్తం పది మంది అభ్యర్థులు 20 సెట్ల నామినేషన్లు సమర్పించగా, వాటిలో నాలుగు సెట్లు తిరస్కరించామని, మిగిలిన వన్నీ ప్రమాణాలకు అనుగుణంగా ఉండడంతో అన్నింటినీ ఆమోదిస్తున్నామని ప్రకటించారు. కాగా ఈనెల 13వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉందని తెలిపారు.మధ్యాహ్నం 3.30గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థులందరితో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఇదిలాఉండగా తుది జాబితా మేరకు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో మొత్తం 22,493 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. నామినేషన్ల పరిశీలన ప్రక్రియలో డీఆర్వో సీతారామారావు, ఎన్నికల సెల్ అధికారులు పాల్గొన్నారు.

స్మార్ట్ స్ట్రీట్స్ అధ్వానం

స్మార్ట్‌సిటీ మిషన్‌లో భాగంగా పనులు

- రూ.60 కోట్లతో ఐదు రహదారుల సుందరీకరణ
- విశాలంగా ఫుట్‌పాత్‌ల నిర్మాణం
- ఫుట్‌పాత్‌లపై యథేచ్ఛగా దుకాణాలు, షెడ్‌ల ఏర్పాటు
- జీవీఎంసీ, పోలీస్‌శాఖల పర్యవేక్షణ లోపం
- రూ.కోట్లు వెచ్చించినా ప్రయోజనం శూన్యం



పార్క్ హోటల్ జంక్షన్ సమీపంలో ఫుట్‌పాత్‌పై విరిగిన పలకలు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ పరిధిలో స్మార్ట్‌సిటీ మిషన్‌లో భాగంగా నిర్మించిన స్మార్ట్‌స్ట్రీట్‌లు ఆక్రమణలు, నిర్వహణ లోపంతో కళావిహీనంగా మారిపోయాయి. ప్రజలకు ఆరోగ్యకరమైన జీవన స్థితిని కల్పించే లక్ష్యంతో రూ.60 కోట్లు వెచ్చించి ఐదు రోడ్లను స్మార్ట్‌స్ట్రీట్స్‌గా అభివృద్ధి చేశారు. అయితే లక్ష్యానికి అనుగుణంగా నిర్వహించడంలో జీవీఎంసీ, పోలీస్ అధికారులు విఫలమవడంతో రోడ్లకు ఇరువైపులా దుకాణాలు, మెకానిక్ షెడ్‌లు వెలిశాయి. ఫుట్‌పాత్‌లపై వేసిన టైల్స్ పైకిలలేచిపోవడం, పనులు పూర్తిస్థాయిలో చేపట్టకుండా వదిలేయడంతో కళావిహీనంగా మారాయి.

దేశంలోని ముఖ్య నగరాల్లో ప్రజలకు ఆరోగ్యకరమైన జీవన పరిస్థితులతోపాటు తగిన మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా 2015లో స్మార్ట్‌సిటీ మిషన్‌కు కేంద్రం శ్రీకారం చుట్టింది. మొదటిదశలో దేశంలోని 20 నగరాలను ఎంపికచేసి అభివృద్ధి చేయాలని నిర్ణయించగా, అందులో విశాఖనగరానికి చోటు లభిం చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో నిధులను సమకూర్చడం ద్వారా ఆయా ప్రాజెక్టులను ఐదేళ్లలో పూర్తిచేయాలని నిర్ణయించింది. జీవీఎంసీ పరిధిలో ఎంపికచేసిన ప్రాంతాన్ని స్మార్ట్‌సిటీ గా అభివృద్ధి చేయాలని భావించడంతో ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి, కోస్టల్‌బ్యాటరీ, జగదాంబజంక్షన్, సిరిపురం, పెదవాల్తేరు, పార్క్‌హోటల్ జంక్షన్ మధ్య ఉన్న ప్రాంతాన్ని (ఏబీడీ) అభివృద్ధి



వాల్తేరు క్లబ్ వద్ద విరిగిపోయిన ఫుట్‌పాత్ పోల్స్

చే సేం ద ు క ు ఎంపికచేశారు. ఆ ప్రాంతంలో సుమారు రూ.1,700 కోట్లు వెచ్చించి 67 ప్రాజెక్టులను చేపట్టాలని నిర్ణయించారు. ఇందులోభాగంగా ఏబీడీ ప్రాంతంలోని 70 కిలోమీటర్ల మేర 62 రోడ్లను రూ.130 కోట్లతో స్మార్ట్‌స్ట్రీట్‌లుగా అభివృద్ధి చేయాలని గ్రేటర్ విశాఖ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ (జీవీఎస్‌సీఎల్) నిర్ణయించింది. స్మార్ట్‌స్ట్రీట్‌లుగా ఎంపికచేసే రోడ్లలో గాలిలో ఆక్సిజన్‌శాతం పెరిగేలా, ప్రజలను ఆరోగ్యకరమైన అలవాట్లు పెంచుకునేలా సౌకర్యాలు కల్పించే ప్రాజెక్టుని డిజైన్ చేశారు. పాదచారులు నడిచేందుకు విశాలమైన ఫుట్‌పాత్‌లు, సైక్లింగ్ ట్రాక్‌లు, రోడ్డుపక్కనే వాహనాల పార్కింగ్‌ట్రాక్‌లు, రోడ్డుకి ఇరువైపులా మొక్కలను పెంచేందుకు గ్రీన్‌డెక్‌లు ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. అయితే దీని వల్ల ప్రస్తుతం ఉన్న రోడ్ల వెడల్పు తగ్గిపోతుందని, వాహన రాకపోకలకు ఇబ్బందులు ఎదురై ట్రాఫిక్ సమస్యకు దారితీస్తుందని ప్రజలతోపాటు ప్రజాప్రతినిధుల నుంచి అభ్యంతరాలు ... మిగతా 6వ పేజీలో



ఫుట్‌పాత్‌పై వెలసిన బడ్డీలు

గొంతునొప్పి, దగ్గు, జ్వరం, ఒళ్లునొప్పులు

సిటీలో ఫ్లూ ఫీవర్స్

- సీజన్ మారే సమయంలో యాక్టివ్ అవుతున్న వైనం
- వైరస్‌లే కారణమంటున్న వైద్యులు
- తీవ్రత ఎక్కువగా ఉందనే అభిప్రాయం
- చిన్నారుల్లో అధికంగా కనిపిస్తున్న సమస్య
- ఆస్పత్రులకు వచ్చేవారిలో సగం మంది వైరస్ బాధితులే



విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి):

నగరంలో ఫ్లూ ఫీవర్స్ ప్రబలుతున్నాయి. వాతావరణంలో మార్పులు, కాలుష్యం కారణంగా వైరస్‌లు విజృంభించి విపరీతమైన దగ్గు, గొంతు నొప్పి, జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న వారి సంఖ్య క్రమేణా పెరుగుతోంది. ప్రతిరోజూ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న వారిలో సగం మంది వైరస్ బాధితులేనని వైద్యులు చెబుతున్నారు.

నగరంలో గతంతో పోలిస్తే వైరస్ తీవ్రత కొంత అధికంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వైరస్ బారిన పడినవారంతా రెండు నుంచి మూడు రోజులపాటు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారంటున్నారు. సాధారణంగా సీజనల్ ఫ్లూ వైరస్‌లు వ్యాప్తి చెందినప్పుడు వచ్చే దగ్గు, జలుబు, గొంతు నొప్పి వంటి సమస్యలకు మందులు వాడాల్సిన అవసరం ఉండదు. ప్రస్తుతం వైరస్ బారినపడుతున్న వారిలో రోజుల తరబడి తీవ్రమైన దగ్గు, విపరీతమైన గొంతు నొప్పి, కొందరిలో జ్వరం, ఒళ్లు నొప్పులు కనిపిస్తున్నాయి. ఇటువంటి వారికి యాంటీబయాటిక్స్ ఇవ్వాల్సి వస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

పిల్లల్లో కఫం సమస్య

పెద్దలతో పోలిస్తే పిల్లల్లో దగ్గుతోపాటు కఫం కూడా ఉంటోంది. ఈ మధ్య మంచు అధికంగా కురవడంతో పాటు చల్లనిగాలులు వీచాయి. మంచులో తిరిగిన, చల్లనిగాలుల బారినపడిన చిన్నారులు చాలామందిలో ఈ లక్షణాలు కనిపిస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. దీనిని అప్పర్ రెస్పిరేటరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్‌గా పిలుస్తారంటున్నారు. దగ్గు, జలుబు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలర్జీ, ముక్కు కారడం వంటి ఇబ్బందులు ఉంటున్నాయని, ఈ దశలో చిన్నారులకు ... మిగతా 6వ పేజీలో

నగరానికి 100 ఇ-బస్సులు

- కూటమి ప్రభుత్వం నిర్ణయం
- 50 చొప్పున రెండు విడతలుగా రాక
- వాల్తేరు, సింహాచలం, గాజువాక డిపోల్లో చార్జింగ్ స్టేషన్లు
- కాలం చెల్లిన 35 బస్సుల తొలగింపునకు నిర్ణయం



ద్వారకాబస్‌స్టేషన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశాఖ రీజియన్‌కు అతి త్వరలో వంద ఎలక్ట్రికల్ బస్సులు రానున్నాయి. ఆర్థిక రాజధానిగా గుర్తింపుతెచ్చుకున్న విశాఖలో వీటిని నడపాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణకు అనువైన ఏర్పాట్లు ఆయా డిపోల్లో చేసుకోవాలని విజయవాడ బస్‌భవన్ నుంచి విశాఖ రీజియన్ అధికారులకు సమాచారం అందింది. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్న తరువాత ఫస్ట్ ఫేజ్‌లో 50బస్సులు పంపుతామని, రెండో విడత మరో 50 పంపుతామని సమాచారం వచ్చింది.

వచ్చేనెల మొదటి వారం నుంచి మూడు నెలల వ్యవధిలో విశాఖకు ఎలక్ట్రికల్ బస్సులు రానున్నట్టు తెలిసింది. దీంతో రీజనల్ మేనేజర్, ఇతర అధికారులు సాంకేతిక నిపుణులతో పాటు రీజియన్‌లోని మధురవాడ, విశాఖపట్నం, వాల్తేరు, మద్దిలపాలెం, సింహాచలం, గాజువాక, స్టీల్‌సిటీ డిపోలను, గ్యారేజీలను పరిశీలించారు. ఇ-బస్సుల పార్కింగ్‌కు అనువైన స్థలం, బస్సుల నిర్వహణకు అవసరమైన పరికరాలతో గ్యారేజీ, చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలను పరిశీలించారు. దీనికి వాల్తేరు, సింహాచలం, గాజువాక డిపోలు అనుకూలంగా ఉన్నట్టు గుర్తించారు. ఈ సమాచారాన్ని ఆర్టీసీ ఉన్నతాధికారులకు పంపారు. ప్రస్తుతం విశాఖ రీజియన్‌లోని ఏడు ... మిగతా 6వ పేజీలో

పూర్ణామార్కెట్‌లో

ఒక్కొక్కరి చేతిలో నాలుగు నుంచి పది షాపులు

బినామీల దందా!

- ఒక్కో దుకాణానికి జీవీఎంసీకి రూ.31 ఆశీలు చెల్లింపు
- వ్యాపారులకు రోజుకి రూ.200 నుంచి రూ.300 అద్దెకు
- దళారులకు అండగా వార్డులోని శానిటేషన్ ఉద్యోగి
- ఎవరైనా దుకాణం వదులుకుంటే మరికరికి అప్పగింత
- ప్రతిగా రూ.లక్ష ముడుపులు
- పట్టించుకోని జీవీఎంసీ జోన్-4 అధికారులు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

నగరంలో ప్రఖ్యాతిగాంచిన పూర్ణామార్కెట్ (సర్దార్ వల్లభాయ్‌పటేల్) దళారుల కబంధహస్తాల్లో చిక్కుకుంది. మార్కెట్‌లోని దుకాణాలను బినామీ పేర్లతో తమ గుప్పిట్లో పెట్టుకుని ఇతరులకు రోజువారీ అద్దెకు ఇచ్చి జేబులు నింపుకుంటున్నారు. దీనిని అడ్డుకోవాల్సిన వార్డు శానిటేషన్ ఉద్యోగి ఒకరు వారికి అండగా నిలుస్తుండడంతో దళారుల దందాకు అడ్డులేకుండా పోతోంది. ఈ నేపథ్యంలో చిన్నపాటి వ్యాపారం చేసుకుని కుటుంబాన్ని పోషించుకోవాలనుకునే వారికి మార్కెట్‌లో దుకాణాల్లేక దళారులకు భారీగా అద్దె చెల్లించాల్సి వస్తోంది.



దళారీల చేతిలో ఉన్న కొన్ని గ్యాంగ్‌వేజ్ దుకాణాలు

పూర్ణామార్కెట్‌లో మొత్తం 400కు పైగా దుకాణాలున్నాయి. ఇవికాకుండా దుకాణాల వరుస మధ్యలో ఏర్పాటుచేసిన గ్యాంగ్‌వేజ్ దుకాణాలు మరో 600 వరకు ఉంటాయి. వీటన్నింటిని వ్యాపారులకు ఒక్కొక్కటి చొప్పున జీవీఎంసీ అధికారులు గతంలోనే కేటాయించారు. ప్రతి దుకాణం నుంచి రోజుకు రూ.31 చొప్పున జీవీఎంసీకి ఆశీలు చెల్లించాలి. అయితే దుకాణం దక్కించుకున్న వారిలో కొందరు మరణించడం, తీవ్ర అనారోగ్యానికి గురవడం, ఆర్థిక ఇబ్బందులు తదితర కారణాలతో వాటిని విడిచిపెడుతుంటారు. వారి నుంచి జీవీఎంసీ అధికారులు దుకాణాలను స్వాధీనం చేసుకుని అర్హులైన వ్యాపారులకు ప్రాధాన్యత మేరకు కేటాయించాలి. కానీ ఎవరైనా దుకాణం వదిలేయాలనుకుంటే ముందుగా జోన్-4 పరిధిలో వార్డు శానిటేషన్ విభాగం ఉద్యోగికి సమాచారం ఇస్తుంటారు. ఆయా దుకాణలను స్వాధీనం చేసుకోకుండా తనకు రూ.లక్ష ఇచ్చేవారికి అప్పగించి, పాతవారికి కొంతమొత్తం ఇప్పించేలా అతడు సెటిల్‌మెంట్ చేస్తున్నాడు. అదే దుకాణాన్ని శానిటేషన్ అధికారిని ప్రసన్నం చేసుకున్న వారికి లేదంటే అతని బినామీలకు బదలాయిస్తున్నారు. మార్కెట్‌లో రుబాబు చేసే కొందరు వ్యాపారులు శానిటేషన్ అధికారి బలహీనతను ఆసరాగా తీసుకుని మార్కెట్‌లో ఖాళీ అయ్యే దుకాణాలను తమ చేతుల్లోకి తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం ... మిగతా 6వ పేజీలో



బినామీలు చేజిక్కించుకున్న దుకాణ సముదాయం

జ్యోతి ఖాతాలో మరో స్వర్ణం

- 200 మీటర్ల పరుగులో రికార్డు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి):



ఎర్రాజీ జ్యోతి

నగరానికి చెందిన అంతర్జాతీయ స్టార్ స్ప్రింటర్ ఎర్రాజీ జ్యోతి ఖాతాలో మరో పసిడి పతకం జమయింది. డెహ్రాడూన్‌లో మంగళవారం జరిగిన మహిళల 200 మీ. పరుగులో స్వర్ణ పతకం సాధించింది. హీట్స్‌లో 23.85 సెకన్లతో ఫైనల్స్‌కు క్వాలిఫై అయిన జ్యోతి...ఫైనల్ రేస్‌ను 23.53 సెకన్లలో పూర్తిచేసింది. దీంతో జాతీయ క్రీడల్లో ఆంధ్రాకు రెండు స్వర్ణ పతకాలు అందించింది. ఆమె విజయం అభినందనీయమని జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డి.నాగేశ్వరరావు, ఎం.నారాయణరావు పేర్కొన్నారు. జ్యోతిని ఒలింపిక్ సంఘం చైర్మన్ గణబాబు, అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్నకుమార్, కంచరాన సూర్యనారాయణ, మోహన్ వెంకటరామ్ అభినందించారు. జాతీయ క్రీడల్లో ఇప్పటి వరకు ఆంధ్రకు ఐదు స్వర్ణ పతకాలు రాగా... విశాఖకు చెందిన క్రీడాకారులు అథ్లెటిక్స్‌లో ఎర్రాజి జ్యోతి రెండు, బీచ్ వాలీబాల్‌లో మణికంఠరాజు-దివ్యసాయి ఒక స్వర్ణం అందించారు.

అయ్యో... జింకలు!



ఇటీవల కుక్కల దాడిలో మృతి చెందిన జింక

- కంబాలకొండలో వన్యప్రాణులకు రక్షణ కరవు
- ఆహారం, నీటి కోసం జనావాసాల్లోకి...
- వాహన ప్రమాదాలు, కుక్కల దాడిలో మృతి
- అభయారణ్యం చుట్టూ ధ్వంసమైన ఫెన్సింగ్
- రక్షణ చర్యలు చేపట్టని అటవీ అధికారులు
- జింకలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ప్రతిపాదన

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి):

నగరానికి ఆనుకుని కంబాలకొండ అభయారణ్యంలో హాయిగా విహరించే జింకలకు రక్షణ కరువైంది. వాటికి సరిపడా ఆహారం, నీరు లభించకపోవడం, దీనికితోడు జాతీయ రహదారికి ఆనుకుని కంబాలకొండ చుట్టూ వేసిన ఫెన్సింగ్ పాడైపోవడంతో జింకలు జనారణ్యంలోకి వచ్చేస్తున్నాయి. జాతీయ రహదారిపైకి చేరడంతో కొన్ని వాహన ప్రమాదాల్లో మృత్యువాత పడుతుండగా, మరికొన్ని కుక్కల దాడిలో బలవుతున్నాయి.





జాతీయ రహదారికి ఆనుకుని కంబాలకొండ చుట్టూ వేసిన ఫెన్సింగ్ పాడైన దృశ్యం. కొన్నిచోట్ల అసలు ఫెన్సింగ్‌లేదు.

కంబాలకొండకు దక్షిణం వైపు ఆదర్శనగర్, ఆరిలోవ, పడమర వైపున దబ్బంద, తూర్పున పీఎంపాలెం, కొమ్మాది వైపు రక్షణగోడలు లేకపోవడంతో జింకలు రాత్రి సమయాల్లో జనావాసాలవైపు వస్తున్నాయి. ఈ క్రమంలో గడచిన వారం రోజుల్లోనే రెండు జింకలు మృత్యువాత పడ్డాయి. సుమారు 1,400 హెక్టార్ల విస్తీర్ణం ఉన్న కంబాలకొండ అభయారణ్యంలో వందల సంఖ్యలో జింకలున్నాయి. ఏటేటా వీటి సంఖ్య పెరుగుతూనే ఉంది. రెండు దశాబ్దాల క్రితం ఇక్కడ ఉన్న జింకలకు అదనంగా బయటిప్రాంతాల నుంచి కొన్ని జింకలు తీసుకువచ్చారు. అప్పటినుంచి ఏటేటా వీటి సంఖ్య పెరుగుతూనే ఉంది.

మూడు వేలకు పైగా...

అటవీశాఖ అధికారుల అంచనా మేరకు కంబాలకొండ అభయారణ్యంలో మూడు వేలకుపైగా జింకలున్నాయి. వీటికి వర్షాకాలం, శీతాకాలంలో పుష్కలంగా ఆహారం లభిస్తుంది. వేసవి ప్రారంభం తరువాత గడ్డి పొదలు తగ్గుతూ వస్తుంటాయి. దీనికితోడు అభయారణ్యంలో చాలాచోట్ల వాగులు ఎండిపోతాయి. ఈ క్రమంలో ఆహారం, తాగునీటికి జింకలు జనారణ్యంలోకి వస్తుంటాయి. జనావాసాలులేని చోట్ల, వాహనాలు ... మిగతా 6వ పేజీలో

ఘనంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం



అన్నసమారాధనలో పాల్గొన్న ప్రముఖులు

భీమునిపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 3వ వార్డు ఎన్టీఆర్ కాలనీలో కొలువైయున్న శ్రీలక్ష్మీగణపతి ఆలయ మూడో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో స్వామికి ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులు అల్లిపిల్లి వేణు, పీతల అప్పారావు పర్యవేక్షణలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, భీమిలి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, పట్టణ ప్రముఖులు మైలపల్లి షణ్ముఖరావు, వైసీపీ పట్టణ నాయకులు అల్లిపిల్లి నర్సింగరావు, ఎస్.కరుణాకర్‌రెడ్డి, కదిరి జగన్నాథం, గొరపల్లి సన్యాసిరావు, గండిబోయిన పోలిరాజు, పుక్కళ్ల అమ్మోరు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థి తరపున ఎన్నికల ప్రచారం

కొమ్మాది, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫెడరేషన్ అభ్యర్థి విజయగౌరిని గెలిపించాలని సీఐటీయూ విశాఖ జిల్లా కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ కోరారు. మంగళవారం ఆమె గెలుపును కోరుతూ మధురవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల, మారికవలస గిరిజన బాలికల ప్రతిభా గురుకుల పాఠశాల కొమ్మాది ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలో ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో సంఘాల నాయకులు రఘుపతి వెంకటరమణ, పి.రాజ్‌కుమార్, బి.భారతి, డి.కొండమ్మ, డి.అప్పలరాజు పాల్గొన్నారు.

క్రీడాసామాగ్రి వితరణ

కొమ్మాది, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 457 మంది విద్యార్థినులకు నాందీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారంక్రీడా సామగ్రిని అందజేశారు. సుమారు రూ.3 వేలు విలువ చేసే 2 టీషర్టులు, సాక్సులు, బూట్లు, పుస్తకాలు, పెన్నుతో పాటు ఒక బ్యాగ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా నాంది ఫౌండేషన్, ఇందుకు సహకరించిన సీరపోళ్ల సోమేశ్‌కు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు గొట్టేటి రవి, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

భీమునిపట్నం: ఇక్కడి సీబీఎం, ... స్కూళ్లకు ... ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): [illegible] ... అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజే[illegible]

ఘనంగా అప్పన్న కల్యాణం



కల్యాణ అక్షతలను చూపుతున్న అర్చకులు

[illegible] ... మేల్కొలిపి ప్రభాతారాధనలను యథావిధిగా పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కమనీయంగా స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

టెన్త్ పరీక్షల నిర్వహణకు సన్నద్ధంగా ఉండండి

జిల్లా ఇన్‌చార్జి డీఆర్వో సీతారామారావు

మహారాణిపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మార్చి 17 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా ఇన్‌చార్జి డీఆర్వో సీతారామారావు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 134 కేంద్రాల్లో 15,094 మంది బాలురు, 13,429 మంది బాలికలు పరీక్షలకు హాజరవుతారన్నారు. ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, అన్ని రకాల సాంకేతిక ప్రక్రియలు పూర్తి చేసి పరీక్షల నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలన్నారు. పరీక్షలు సజావుగా ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పోలీసు, రెవెన్యూ, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖ, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

సర్వేలు త్వరితగతిన పూర్తిచేయాలి

ఎంపీడీవో ఎం.విజయ్‌కుమార్



రేవిడి సచివాలయంలో సిబ్బందికి సూచనిస్తున్న ఎంపీడీవో

పద్మనాభం రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో నిర్వహిస్తోన్న వివిధ రకాల సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో ఎం.విజయ్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం రేవిడి, బి.తాళ్లవలస గ్రామపంచాయతీలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను ప్రజలకు చేరువ చేసే విధంగా కృషి చేయాలన్నారు.

సంపద కేంద్రాల పరిశీలన

గ్రామాల్లో చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించాలని ఈవోపీఆర్డీ వీనాకుమారి పేర్కొన్నారు. మంగళవారం ఉదయం గంధవరం, బాందేవపురం గ్రామాల్లో గల చెత్త కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పరిసరాల పరిశుభ్రతపై ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పైడయ్య తదితరులు పాల్గొన్నారు.

రామతత్వంతో రుషిగా మారిన మారీచుడు

ఆకట్టుకుంటున్న 'చాగంటి' ప్రవచనాలు

కొమ్మాది, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాముడిని రాక్షసుడైన మారీచుడు కాశీభూతమైన ధర్మంగా అభివర్ణించాడని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరావు పేర్కొన్నారు.

కొమ్మాది గాయత్రి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న సంపూర్ణరామాయణం ప్రవచనాల్లో భాగంగా మంగళవారం.. అయోధ్య కాండలోని పలు ఘట్టాలను వివరించారు. రావణాసురుడు శ్రీరాముని పట్ల అనేక అసత్య ఆరోపణలు చేసి తన సహాయాన్ని ఆపేక్షించినప్పుడు, శ్రీరాముడి నిజమైన గుణాలను ఆవిష్కరించి రాముడి పట్ల అపరాధం చేద్దాం అనే ఆలోచన ఎంత ప్రమాదకరమో అనే విషయం మారీచుడు వివరించాడని తెలిపారు. కార్యక్రమంలో అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసి డ్రైవర్ నిజాయితీ



లెక్చరర్ మహాలక్ష్మికి ఫోన్ అందజేస్తున్న శ్రీను

భీమునిపట్నం, ఫిబ్రవరి 11 (ఆన్‌లైన్) : సిటీ బస్సులో పోగొట్టుకున్న స్మార్ట్ ఫోన్‌ను తిరిగి భద్రంగా బాధితురాలికి అప్పగించిన ఆర్టీసి డ్రైవర్ ఉదంతమిది.వివరాలిలా ఉన్నాయి. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సిటీ బస్సు 999లో భీమిలి ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ డైట్ లెక్చరర్ ఎం.మహాలక్ష్మి ప్రయాణిస్తున్నారు. ఆమె బొడ్డపాలెం బస్సు దిగిపోయారు. తన రూ.25 వేల సెల్‌ఫోన్‌ను కూర్చున్న సీటులోనే మర్చిపోయారు. దీంతో ఆ సెల్ ఫోన్‌ను ఓ యువకుడు తీసుకోవడాన్ని డ్రైవర్ శ్రీనివాసరావు గమనించారు. సంబంధిత యువకుడు బస్సును మరో స్టాపు వద్ద దిగుతుండగా డ్రైవర్ ప్రశ్నించి తీసుకున్నారు. తర్వాత ఆ బస్సు భీమిలి రావడం, తిరిగి విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్‌కు తిరుగు ప్రయాణమైంది. అయితే బొడ్డపాలెంలో టీచింగ్ ప్రాక్టీస్‌కు ఆ గ్రామంలో ఎంపీపీ స్కూల్‌కు విచ్చేసిన ఛాత్రోపాధ్యాయుల క్లాస్‌ను పరిశీలించి తిరిగి డైట్‌కు వచ్చారు. అపుడు ఆమె హ్యాండ్ బ్యాగ్‌లో చూడగా సెల్‌ఫోన్ పోయినట్లు గమనించారు. ఈ విషయాన్ని ఆమె తన భర్తకు తెలియజేయడం, ఆయన కాల్ చేయడంతో డ్రైవర్ రిసీవ్ చేసుకుని తన వద్దనే భద్రంగా వుందని, తిరిగి మధ్యాహ్నం రెండున్నర గంట ప్రాంతంలో భీమిలి వచ్చినపుడు సెల్‌ఫోన్‌ను మహాలక్ష్మికి అందజేశారు. బస్సు డ్రైవర్ శ్రీనివాసరావు నిజాయితీకి పలువురు అభినందించారు.

అధ్యాపకులు గ్రంథ రచనలకు కృషిచేయాలి

భీమిలి ప్రభుత్వ ఎస్వీఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మంజుల



పుస్తకాన్ని విష్కరిస్తున్న ప్రిన్సిపాల్ మంజుల, రచయిత విష్ణుమూర్తి, అధ్యాపకులు

భీమునిపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : భీమిలి ప్రభుత్వ ఎస్వీఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా పని చేస్తున్న సీహెచ్ విష్ణుమూర్తి రాసిన 'విమెన్ ఎంపవర్మెంట్ త్రూ సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్' పుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.మంజుల ఆవిష్కరించారు. కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పుస్తక రచయిత విష్ణుమూర్తిని అభినందించారు. అనంతరం మంజుల మాట్లాడుతూ అధ్యాపకులు విష్ణుమూర్తిని స్ఫూర్తిగా తీసుకుని కళాశాలలో ఉన్న అధ్యాపకులందరూ వేర్వేరు అంశాలలో పరిశీలనాత్మక గ్రంథాలను ప్రచురణకు కృషిచేయాలని కోరారు.కార్యక్రమంలో ఈ పుస్తకంలోని అంశాలను విద్యార్థులకు వివరించారు.

వివాదస్పద స్థలాన్ని పరిశీలించిన పోలీసులు



వివాదస్పద స్థలం వద్ద ఇరు వర్గాలతో మాట్లాడుతున్న ఆరిలోవ ఎస్ఐ రామదాసు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్‌లో శివాలయం ఆవరణలో ఉన్న ఓ స్థలం విషయంలోశివాలయం నిర్వాహకులు, పర్యాటక అభివృద్ధి శాఖకు మధ్య వివాదం ఏర్పడింది. పర్యాటక స్థలానికి ఆనుకుని శివాలయం వైపు ఇటీవల ఆలయ నిర్వాహకులు దుకాణం ఏర్పాటు చేశారు. అయితే ఆ స్థలం మాది అంటూ పర్యాటకాభివృద్ధి అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారంఆరిలోవ ఎస్ఐ రామదాసు స్థలం వద్దకు చేరుకుని పరిశీలించారు. ఇరువురు వారి వద్ద ఉన్న డాక్యుమెంట్లను చూపించాలని, తరువాత వాటిని పరిశీలించి సంబంధిత అధికారులకు నివేదిక అందిస్తామన్నారు. అప్పటి వరకు ఎలాంటి వివాదాలకు దిగవద్దని వారించారు.

వ్యర్థాలతో సుద్దగెడ్డ నీరు కలుషితం

- ఇక్కడ చెత్తాచెదారం వేయకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజలు



సుద్దగెడ్డ పక్కన ఉన్న చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలు

మధురవాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని సుద్దగెడ్డ నీరు వ్యర్థాలతో కలుషితమవుతోంది. గతంలో సుద్దగెడ్డ నీరు ఎంతో స్వచ్ఛంగా ఉండేది. కాలక్రమంలో గెడ్డను ఆనుకుని పలు కాలనీలు రావడంతో ఆయా ప్రాంతాల నుంచి వాడుక నీరంతా గెడ్డలో వచ్చి కలుస్తుంది. దీంతో పాటు పలువురు రాత్రి వేళల్లో గెడ్డ పక్కనే డెబ్రిస్, ఇతర వ్యర్థాలను కుప్పలుగా వేస్తున్నారు. భవన నిర్మాణాలకు సంబంధించిన వ్యర్థాలను, ఇళ్లకు సీలింగ్ వేసేందుకు వినియోగించే వ్యర్థ మెటీరియల్‌ను ఇక్కడే ఇష్టానుసారంగా పడేస్తున్నారు. దీంతో ఏ మాత్రం వానొచ్చిని వ్యర్థాలన్నీ గెడ్డలో కలిసిపోతున్నాయి. సుద్దగెడ్డపై సుమారు 15 ఏళ్ల కిందట గొలుసుకట్టుగా తొమ్మిది చెక్ డ్యామ్‌లను నిర్మించారు. ఈ గెడ్డలో నీరు ఎల్లప్పుడు ఉండడం వల్ల భూగర్భ జలాలు పుష్కలంగా ఉంటాయి. మిథిలాపురి వుడా కాలనీ, పాత మధురవాడ మెట్ట, ఎన్‌జీవో కాలనీ, తదితర ప్రాంతాల ప్రజలకు సుద్దగెడ్డ కారణంగా ఎప్పుడూ తాగునీటికి కొరత ఏర్పడదు. కానీ ఇటీవల వివిధ కారణాల వల్ల గెడ్డ నీరు కలుషితమవ్వడంతో బోరు బావుల నుంచి వస్తున్న నీరు దుర్వాసన వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల సంబంధిత అధికారులు స్పందించి గెడ్డను ఆనుకుని చెత్తాచెదారం, డెబ్రిస్, డెబ్రిస్, భవన నిర్మాణ వ్యర్థాలు వంటివి ఎవరూ వేయకుండా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. సహజ సిద్ధంగా ఉన్న గెడ్డను పరిరక్షిస్తే వేలాది మంది ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని పలువురు పేర్కొంటున్నారు.

జూట్ మిల్లు కార్మికులకు, ఉద్యోగులకు న్యాయం చేయాలి

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



మిల్లు యాజమాన్య ప్రతినిధులు, కార్మిక నాయకులతో సమావేశమైన గంటా

తగరపువలస, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న చిట్టివలస జూట్ మిల్లు కార్మికులు, ఉద్యోగులకు త్వరితగతిన న్యాయం చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సంబంధిత అధికారులు, మిల్లు యాజమాన్యాన్ని కోరారు. మంగళవారం రాత్రి ఎంవీపీలోని తన కార్యాలయంలో చిట్టివలస జూట్ మిల్లు యాజమాన్య ప్రతినిధి బజోరియా, కార్మిక సంఘాల నాయకులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ కార్మికులకు, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను త్వరితంగా చెల్లించాలన్నారు. అందుకు యాజమాన్య ప్రతినిధి బజోరియా అంగీకారం తెలిపారు. ముఖ్యంగా, కార్మికులకు రావాల్సిన పీఎఫ్, గ్రాట్యుటీ, తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో త్వరలో చర్చించాలని నిర్ణయించారు. కంపెనీ క్వార్టర్స్‌లో నివసిస్తున్న కార్మికులకు, మిల్లును మూసివేశాక కూడా యాజమాన్య సూచనలతో నెలల తరబడి పనిచేసిన ఉద్యోగులకు న్యాయం చేయాలని బజోరియాకు గంటా సూచించారు. ఉద్యోగులు, సరఫరాదారుల నుంచి సేకరించిన డిపాజిట్లను తిరిగి చెల్లించాలని ఆయన పేర్కొన్నారు. కార్మికులు, ఉద్యోగుల హక్కులకు భంగం కలగకుండా చూడాలని, రెండు రోజుల్లో అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌తో ఇరుపక్షాలు సమావేశమై పలు అంశాలపై ఒక అవగాహనకు రావాలన్నారు. సమావేశంలో మిల్లు యాజమాన్య ప్రతినిధులు భజోరియా, లలిత్ మోహన్, రామ్‌కుమార్, కార్మికులు, ఉద్యోగుల తరపున నాయకులు కాకర్లపూడి వరహాలరాజు, పడాల రమణ, ఎ.బాబూరావు, కె.ఈశ్వరరావు, సీహెచ్ నరసింగరావు, దేముళ్లు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

'ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్'లో సత్తా చాటిన 'అవంతి' విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న అవంతి శ్రీనివాసరావు, తదితరులు

తగరపువలస, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి హాక్‌థాన్ ఆన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై నిర్వహించిన సాంకేతికత నైపుణ్య ప్రదర్శనల్లో తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు రూపొందించిన నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ ఆన్ కంప్యూటర్ విజన్ ఆధారిత రోబోకు ప్రథమ బహుమతి లభించింది. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అవంతి విద్యాసంస్థల ఛైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ విజయవాడ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన జాతీయ స్థాయి హాక్‌థాన్ ఆన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పోటీల్లో వివిధ దేశాల కళాశాలల నుంచి సుమారు 1,600 మంది విద్యార్థులు పాల్గొనగా, తమ కాలేజీ ప్రథమ బహుమతిని సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ విభాగాధిపతి శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల హామీలను అమలు చేయాలి'

తగరపువలస, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు అమలు చేయాలని సీపీఐ చిట్టివలస ప్రాంత కార్యదర్శి కానూరి రాంబాబు కోరారు. మంగళవారం మెయిన్ రోడ్డులో ఉన్న ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సీపీఐ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలకు అర్బన్‌లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలాలిస్తామన్న హామీతో పాటు మిగతా వాటిని అమలు చేయాలన్నారు. సమావేశంలో నాయకుడు మోర్ అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ స్ట్రీట్స్ అధ్వానం

... 5వ పేజీ తరువాయి

వ్యక్తమయ్యాయి. దీంతో కేవలం ఏడు కిలోమీటర్లు మేర ఐదు రోడ్లను మాత్రమే రూ.60 కోట్లతో స్మార్ట్‌స్ట్రీట్‌లుగా అభివృద్ధి చేయాలని జీవీఎస్‌సీసీఎల్ నిర్ణయించింది. ఈ మేరకు పెదవాల్తేరు జంక్షన్ నుంచి చినవాల్తేరు మార్గంలో ప్రభుత్వ మానసికవైద్యశాల జంక్షన్ వరకు ఉన్నరోడ్డు, పార్క్‌హోటల్ జంక్షన్ నుంచి పెదవాల్తేరు జంక్షన్ రోడ్డు, సిరిపురం జంక్షన్ నుంచి ఆల్‌ఇండియా రేడియో కేంద్రానికి ఇరువైపులా ఉన్న రెండు రోడ్లు, సిరిపురం జంక్షన్ నుంచి పాండురంగాపురం డౌన్ రోడ్డును స్మార్ట్‌స్ట్రీట్‌లుగా ఎంపిక చేశారు.

అధ్వానంగా మారిన వైనం

జీవీఎంసీ రూ.60 కోట్లు వెచ్చించి అభివృద్ధి చేసిన ఈ ఐదు రోడ్లలో ఒకటైన పెదవాల్తేరు జంక్షన్ నుంచి ప్రభుత్వ మానసిక వైద్యశాల జంక్షన్ రోడ్డు ప్రస్తుతం అధ్వానంగా మారింది. రోడ్డు పొడవునా అందమైన టైల్స్‌తో నిర్మించిన ఫుట్‌పాత్‌లు, సైక్లింగ్‌ట్రాక్‌లు, పార్కింగ్ స్థలాలను ఆక్రమించి దుకాణాలు, మెకానిక్ షెడ్లు, స్క్రాప్ గోడౌన్లను ఏర్పాటు చేశారు. స్మార్ట్‌స్ట్రీట్ ప్రాజెక్టు డిజైన్‌లో పేర్కొన్నట్టుగా ప్రజా వినియోగంలో ఉండేలా చూడాల్సిన జీవీఎంసీ, పోలీస్ అధికారులు ఆ బాధ్యతను విస్మరించడంతో ఆక్రమణదారులకు అడ్డులేకుండాపోయింది. వాకింగ్‌ట్రాక్, ఫుట్‌పాత్‌లను తవ్వేయడంతో రూ.కోట్లు వెచ్చించి వేసిన టైల్స్ పైకి లేచిపోయాయి. వాకింగ్‌ట్రాక్‌లు, ఫుట్‌పాత్‌లపై నడిచేందుకు చోటులేకపోవడంతో పాదచారులంతా రోడ్డుపైనే నడవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆ రోడ్డులో ఉన్న బస్టాప్‌లను కూడా ఆక్రమించి, దుకాణాలను ఏర్పాటు చేసుకోవడం పరిస్థితికి అద్దంపడుతోంది. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్మార్ట్‌స్ట్రీట్‌గా అభివృద్ధి చేసిన రోడ్డులో ఆక్రమణలను తొలగించి లక్ష్యానికి అనుగుణంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది.

పూర్ణామార్కెట్‌లో బినామీల దందా!

... 5వ పేజీ తరువాయి

మార్కెట్‌లో ఓ వ్యక్తి ఏదో ఒక అసోషియేషన్ పేరుతో హడావుడి చేస్తూ డీ సెక్షన్‌లోని ఆరు దుకాణాలు, సీ సెక్షన్‌లో ఒక దుకాణం, గ్యాంగ్‌వేజ్‌లో ఐదు దుకాణాలు, తావేజిలు కట్టే వరుసలో ఒక దుకాణాన్ని తన గుప్పిట్లో ఉంచుకున్నారు. మార్కెట్‌లో వ్యాపారం చేసే మరో వ్యక్తికి గ్యాంగ్‌వేజ్‌లో ఆరు దుకాణాలు, బి సెక్షన్‌లో రెండు, చేపలమార్కెట్‌లో ఒక దుకాణం ఉన్నాయి. మరో దళారీ పీ సెక్షన్‌లో మూడు, గ్యాంగ్‌వేజ్‌లో మూడు దుకాణాలు తన చేతిలో ఉంచుకున్నారు. కిరాణా దుకాణం నడిపే ఓ వ్యక్తి బి సెక్షన్‌లో మూడు దుకాణాలను కలిగి ఉన్నారు. ఇలా మరికొందరు రెండుకంటే ఎక్కువ దుకాణాలను చేజిక్కించుకుని వాటిని ఇతర వ్యాపారులకు అద్దెలకిచ్చి జేబులు నింపుకుంటున్నారు. ఈ విషయాలన్నీ అక్కడే ఉండి ప్రత్యక్షంగా పరిశీలించే వార్డు శానిటేషన్ ఉద్యోగికి తెలిసినా అభ్యంతరం చెప్పకపోవడం విశేషం.

బినామీల సమాచారం సేకరించాం

మార్కెట్‌లో కొంతమంది పదుల సంఖ్యలో దుకాణాలను తమ గుప్పిట్లో పెట్టుకున్నారనే సమాచారం ఉంది. దీనిపై ఆధారాలు సేకరిస్తున్నాం. దుకాణాలను రోజువారీ అద్దెకు ఇచ్చి జేబులు నింపుకుంటున్న దళారుల నుంచి స్వాధీనం చేసుకోవడానికి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. త్వరలోనే ఒకరికి ఒక దుకాణం మాత్రమే ఉండేలా ప్రక్షాళన చేస్తాం.

-ఎం.మల్లయ్యానాయుడు, జోన్-4 కమిషనర్

అయ్యో... జింకలు!

... 5వ పేజీ తరువాయి

సంచరించని చోట్లకు వెళ్లినా ప్రమాదం ఉండదు. కానీ అటు ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల, ఇటు కంబాలకొండ మధ్యనుంచి వెళుతున్న జాతీయ రహదారి, మధురవాడ, పీఎంపాలెం, కొమ్మాది, ఆదర్శనగర్‌వైపు వచ్చే జింకలు ప్రమాదంలో చిక్కుకుంటున్నాయి. జాతీయ రహదారిని దాటి ఎండాడ, విశాఖ వ్యాలీ స్కూలు రోడ్డులో వెళ్లినపుడు వాహనాలు ఢీకొని ప్రాణాలు కోల్పోతున్నాయి. కంబాలకొండ అభయారణ్యానికి ఫెన్సింగ్‌లేని ప్రాంతాల నుంచి జింకలు జాతీయ రహదారిపైకి వస్తున్నాయి. ఆ సమయంలో వాహనాలపై వెళ్లేవారు కొందరు వాటిని చూసి, తిరిగి కంబాలకొండవైపు పంపుతుంటారు. భారీ వాహనాలు వేగంగా వెళ్లేటప్పుడు రోడ్డు దాటే క్రమంలో జింకలు ప్రమాదానికి గురవుతుంటాయి.

రక్షణ చర్యలు చేపట్టాలి

ప్రస్తుతం కంబాలకొండలో జింకల రక్షణపై అటవీశాఖ అప్రమత్తంకావాలని ప్రజలు కోరుతున్నారు. కంబాలకొండ చుట్టూ ఫెన్సింగ్ వేయడం, కొన్నిచోట్ల రక్షణ గోడలు నిర్మించాలని సూచిస్తున్నారు. అయితే కంబాలకొండలో భారీగా ఉన్న జింకల్లో కొన్నింటిని ఇతర అభయారణ్యాలకు తరలించాలని అధికారులు యోచిస్తున్నట్టు సమాచారం. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారని తెలిసింది. అయితే దీనికి కేంద్ర ప్రభుత్వం అనుమతి తప్పనిసరి. అప్పటివరకు కంబాలకొండ అభయారణ్యంలో జింకలకు రక్షణ కల్పించడంతోపాటు వేసవిలో తాగునీరు, ఆహారం కోసం గడ్డిని పెంచాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

నగరానికి 100 ఇ-బస్సులు

... 5వ పేజీ తరువాయి

డిపోల్లో 804 బస్సులు సేవలందిస్తుండగా, వాటిలో 35 కాలం చెల్లిన బస్సులున్నాయి. 13 లక్షల కిలోమీటర్లు తిరగడం, 15 సంవత్సరాల పాటు రవాణా సేవలు అందించిన బస్సులను కాలం చెల్లినవిగా గుర్తిస్తారు. అవి ప్రయాణికుల రవాణా సేవలకు వినియోగించరాదన్న నిబంధన ఉంది. ఇలాంటి బస్సులు వివిధ డిపోలు, గ్యారేజీల్లో ఉన్నాయి. అత్యవసర సమయాల్లో మాత్రమే వీటిని వినియోగిస్తున్నారు. ఎలక్ట్రికల్ బస్సులు అందుబాటులోకి వచ్చిన వెంటనే ఈ బస్సులను రవాణా సేవలనుంచి తొలగించి విజయనగరం సెంట్రల్ గ్యారేజీకి పంపుతామని రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. తిరుపతి- తిరుమల మధ్య ప్రవేశపెట్టిన ఎలక్ట్రికల్ బస్సులతో రవాణా సౌకర్యం మెరుగ్గా ఉండడంతో విశాఖలో వీటిని నడపాలని ప్రభుత్వం నిర్ణయించింది.

సిటీలో ఫ్లూ ఫీవర్స్


... 5వ పేజీ తరువాయి

నెబిలైజేషన్ పెట్టాల్సి వస్తోందని తెలిపారు.

రోగుల సంఖ్య ఎక్కువే...

గొంతు నొప్పి, జలుబు, దగ్గుతో కేజీహెచ్, విమ్స్‌లకు ప్రతిరోజూ 40 మంది వరకూ వస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు వస్తున్నవారిలో దాదాపు 50 శాతం మందికి ఈ లక్షణాలున్నాయని వైద్యులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో ఎండతీవ్రత పెరిగే కొద్దీ కొన్ని వైరస్‌లు మరింత యాక్టివ్ అవుతాయని, దీనివల్ల కేసులు పెరుగుతాయని వైద్యులు చెబుతున్నారు.

తీవ్రతను బట్టి మందులిస్తున్నాం



ఫ్లూ కేసులు పెరిగాయి. తీవ్రతను బట్టి మందులు ఇస్తున్నాం. కొందరికి యాంటీ బయాటిక్స్ ఇవ్వాల్సి వస్తోంది. సీజన్ మారు తున్న సమయంలో ఫ్లూ వైరస్‌లు వ్యాప్తి చెందుతుంటాయి. ప్రస్తుత వైరస్ తీవ్రత కొంత బలంగా ఉన్నట్టు కనిపిస్తోంది. అందువల్ల రోజుల తరబడి లక్షణాలుంటున్నాయి. మూడు రోజులకు మించి దగ్గు, ఇతర లక్షణాలుంటే వైద్యులను సంప్రతించాలి.

- డాక్టర్ వై.జ్ఞానసుందరరాజు, జనరల్ మెడిసిన్ వైద్యులు

సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు





కప్పస్తంభం వద్ద బొత్స సత్యనారాయణ, ఝాన్సీ దంపతులు, పక్కన మునిరత్నంరెడ్డి, తదితరులు

సింహాచలం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ దంపతులతో పాటు పోస్ట్ మాస్టర్ జనరల్ విశాఖ రీజియన్ దేవిరెడ్డి ఎస్వీఆర్ రెడ్డి, ఏపీ గ్రేప్ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి, తదితరులు మంగళవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ఆహ్వానం పలికారు. కప్పస్తంభ ఆలింగనం చేసుకున్నాక వారి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు జరిపారు. గోదాదేవి అమ్మవారి దర్శనానంతరం వారికి పండితులు వేదాశీర్వచాలు ఇవ్వగా, ఈవో వేంద్ర త్రినాథరావు, ఏఈఓ ఎస్.ఆనందకుమార్‌లు దుశ్శాలువాలతో సత్కరించి స్వామివారి ఫొటోలు, ప్రసాదాలను అందజేశారు.

ఉచిత శిక్షణకు సెమ్సేతో ఒప్పందం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): టొయోట్సు రేర్ ఎర్త్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (టీఆర్ఈఐ) కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైం, షిప్ బిల్డింగ్ (సెమ్స్) సహకారంతో 18 నుంచి 27 ఏళ్ల వయస్సు కలిగి ఐటీఐ ఫిట్టర్, డిప్లొమా మెకానికల్ ఇంటర్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వడానికి ఒప్పందం కుదిరింది. సీఎన్‌సీ ఆపరేటర్, ఇన్వెంటరీ కంట్రోలర్, వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్ తదితర ఉపాధి ఆధారిత శిక్షణ కార్యక్రమాల్లో 75 మందికి రెండు నెలలు శిక్షణ ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్టు సంస్థ సీఈవో సేతు మాధవన్ తెలిపారు. ఆసక్తి కలిగిన విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల నిరుద్యోగ అభ్యర్థులు ఈ నెల 17లోపు దరఖాస్తు చేసుకునేందుకు సింధియా జంక్షన్‌లోని సెమ్స్ కేంద్రంలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ :86884 11100, 83319 01237లో సంప్రదించాలన్నారు. టీఆర్ ఈఐ మేనేజింగ్ డైరెక్టర్ కోయిచి సాటో, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ బి. మురళీధరరావు, సెమ్స్ సీవోవో గోపీకృష్ణ, శివం పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో శైలజకు స్వర్ణ పతకాలు


శైలజను అభినందిస్తున్న మధుకుమార్, లక్ష్మణరెడ్డి తదితరులు

విశాఖపట్నం స్పోర్ట్స్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మీట్‌లో బుల్లయ్య కళాశాల విద్యార్థిని బి.శైలజ మూడు స్వర్ణ పతకాలు కైవసం చేసుకుంది. విజయవాడలో జరిగిన ఈ టోర్నీ అండర్-18 మహిళల 60 మీ., 200 మీ. పరుగులో ప్రథమ స్థానంతో స్వర్ణ పతకాలు సొంతం చేసుకున్న శైలజ...4+400 రిలే రేస్‌లోనూ వేగవంతమైన పరుగు తీసి స్వర్ణ పతకం సాధించింది. మీట్ ఉత్తమ అథ్లెట్ అవార్డు అందుకుంది. మంగళవారం కళాశాల కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్ తన కార్యాలయంలో శైలజను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బీఆర్ఎస్ లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

'విశ్వగురు' బిరుదుపై హర్షం

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మహా కుంభమేళాలో ఇస్కాన్, ప్రపంచవ్యాప్త హరేకృష్ణ ఉద్యమ వ్యవస్థాపక ఆచార్యులు భక్తి వేదాంత స్వామి ప్రభుపాదులకు 'విశ్వగురు' బిరుదును అఖిల భారతీయ అఖారా పరిషద్ ప్రదానం చేసిన సందర్భంగా నగరంలోని హరేకృష్ణ మూవ్‌మెంట్ హర్షం వ్యక్తం చేసింది.

సినిమా గైడ్

- **తండేల్ :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ(గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ),
- **భవానీ వార్డ్ :** జగదాంబ, రమాదేవి
- **మదగజరాజ :** జగదాంబ, వెంకటేశ్వర-1, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),
- **సంక్రాంతికి వస్తున్నాం :** శారద, మెలోడి, జగదాంబ, కిన్నెర, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 10, వంకాయలు (తెలుపు)16, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 36, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 12, క్యాబేజి 12, క్యారెట్ 24 దొండకాయలు 30, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)40, బరబాటి 34, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 62, బద్దచిక్కుడు 26, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 130, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 40, కీరదోస 26, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 32 చిలగడదుంపలు 38, కంద 68, దేముడు చిక్కుడు 28, గోరు చిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	96
లైవ్ ధర	116
విత్ స్కిన్	202
స్కిన్‌లెస్	212

పురాతన నిర్మాణ పద్ధతిలో అప్పన్న ఆలయ మరమ్మతులు

- ఆలయ పైకప్పు వర్షపు లీకేజీల నివారణకు చర్యలు
- తొలి విడతగా రూ.4 కోట్ల చెక్ అందజేసిన పుణెకు చెందిన వేంకటేశ్వరరావు
- సంస్థ ప్రతినిధులతో ఎమ్మెల్యే గంటా ఒప్పందం


ఎంవోయూ పత్రాలు అందుకుంటున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, దేవస్థానం ఈవో, సంస్థ ప్రతినిధులు

సింహాచలం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : సింహాచల వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ పై కప్పు నుంచి వర్షపు నీటి లీకేజీలు అరికట్టి శాశ్వత చర్యలు చేపట్టేందుకు పుణెకు చెందిన లార్డు వేంకటేశ్వర చారిటబుల్ అండ్ రిలిజియస్ ట్రస్టు ముందుకు వచ్చింది. కొన్ని శతాబ్దాల క్రితం మనదేశంలో సివిల్ నిర్మాణాలు చేపట్టిన ఈ సంస్థ సనాతన విధానంలో మరమ్మతులు చేయడానికి పూనుకొంది. అందుకు సంబంధించిన ఎంవోయును సంస్థ ప్రతినిధులతో భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు మంగళవారం సింహగిరిపై దేవస్థానం ఈవో వేంద్ర త్రినాథరావుతో కలిసి మార్చుకున్నారు. పుణెకు చెందిన వేంకటేశ్వరరావు అనే భక్తుడు సింహగిరి ఆలయ మరమ్మతులకు ఎంతైనా వెచ్చించేందుకు ముందుకు వచ్చారు. ఇందుకోసం తొలి విడతగా రూ.4 కోట్ల చెక్‌ను గంటా సమక్షంలో దేవస్థానం ఈవోకు అందజేశారు. కొన్ని దశాబ్దాలుగా కాస్త వర్షం కురిసినా అప్పన్న ఆలయంలోకి నీరు చేరడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

దేవస్థానం అధికారులు ఎన్నిసార్లు ఆధునిక విధానాల్లో మరమ్మతులు చేపట్టినా ఫలించలేదు. ఈ విషయం తెలుసుకున్న తిరుమలవాసి, పురావస్తు శాఖ డైరెక్టర్ చొరవ తీసుకుని పుణెకు చెందిన వేంకటేశ్వర చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు వేంకటేశ్వరరావుకు విషయాన్ని వివరించారు. ఆయన తక్షణం అప్పన్న ఆలయ మరమ్మతులు చేపట్టేందుకు కావాల్సిన ఆర్థిక సహాయాన్ని అందజేసేందుకు ముందుకు వచ్చారు. దాంతో మునిరత్నం రెడ్డి పర్యవేక్షణలో పురాతన రాజులు నిర్మించిన కట్టడానికి ఎటువంటి మార్పులు చేయకుండా సుమారు వెయ్యేళ్ల క్రితం నాటి విధానంతో మరమ్మతులు చేపట్టాని సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసింది.

తాజాగా సింహాద్రినాథుడి ఆలయ మరమ్మతు పనుల్లో సిమెంటును వినియోగానికి పూర్తిగా స్వస్తి పలుకుతున్నట్టు సంస్థ ప్రతినిదులు, పురావస్తు శాఖ అధికారులు నిర్ణయించుకున్నారు. పూర్వీకుల కాలంలో నిర్మాణాలకు చేపట్టిన తరహాలో ఒక ప్రత్యేక మిశ్రమాన్ని తయారు చేయనున్నారు. సున్నం, ఆఫ్రికా నుంచి దిగుమతి చేసుకునే విశేష గుణాలున్న కాల్చిన మట్టి, బెల్లం, కరక్కాయ పొడి, ఇటుకల పొడి, ప్రత్యేక చెట్ల నుంచి వచ్చే గమ్(బంక)ను వినియోగించనున్నారు. వీటన్నింటినీ కలిపి ప్రత్యేక డ్రమ్‌ల్లో నానబెట్టి ఇసుకతో కలిపి మిశ్రమాన్ని సిద్ధం చేస్తారు. పూణె సంస్థ కార్మికులతో పనులను రెండు వారాల్లో ప్రారంభించనున్నట్టు సంస్థ ప్రతినిధి ప్రకటించారు. ఎంవోయూ ప్రకారం పనులను 9 నెలల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎంవోయూ అందజేసే కార్యక్రమంలో దేవస్థానం ఈఈ డీజీ శ్రీనివాసరాజు, 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజాజీవనం మెరుగు పడాలి

ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు


సదస్సులో ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు, పాల్గొన్న ప్రొఫెసర్లు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ భారతంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు కావాలని ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు అన్నారు. ఏయూ రాజనీతి, ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు 'రోల్ అండ్ రిలవెన్స్ ఆఫ్ ది పార్లర్ బాడీస్ ఇన్ రూరల్ లోకల్ గవర్నమెంట్'ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సహకారంతో ఈ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సదుపాయాల కల్పన దిశగా కృషి జరగాలని సూచించారు. ఈ ప్రక్రియలో స్థానిక సంస్థలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంపూర్ణ సహకారం, స్వేచ్ఛను అందించాల్సిన అవసరం ఉందన్నారు. పోషక ఆహార లోపం, అనారోగ్యం, మానసిక సమస్యలు వంటివి గ్రామీణ ప్రాంతాల ప్రజలను సైతం ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. ఈ సమస్యలను పరిష్కరించే దిశగా నిపుణులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు.

ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు మాట్లాడుతూ రెండు రోజుల జాతీయ సదస్సులో భాగంగా 250కి పైగా పరిశోధనా పత్రాలను పరిశోధకులు సమర్పించారని తెలిపారు. వర్తమాన ప్రాధాన్యం కలిగిన అంశంపై ఈ సదస్సును నిర్వహించడం జరిగిందన్నారు. స్థానిక సంస్థల అభివృద్ధి, పటిష్టత, ప్రాధాన్యతలను ఈ సదస్సులో చర్చించినట్టు వివరించారు. సదస్సు డైరెక్టర్ పి.ప్రేమానందం మాట్లాడుతూ సదస్సులో భాగంగా ఎనిమిది సెషన్స్ నిర్వహించినట్టు చెప్పారు. అత్యుత్తమ ప్రమాణాలు కలిగిన పరిశోధనా పత్రాలను సదస్సులో సమర్పించినట్టు వివరించారు. సుస్థిర అభివృద్ధికి, గ్రామీణ ప్రగతికి స్థానిక సంస్థల కృషి ఎంతో అవసరమన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ, అధికారుల ప్రాముఖ్యతను వివరించారు. స్థానిక సంస్థలకు తగినన్ని నిధులు అందించడం లేదని, అధికారులను తగ్గిస్తూ వీటిని నిర్వీర్యం చేసే ప్రక్రియ జరగడం విచారకరమన్నారు. కార్యక్రమంలో రీజనల్ ఎంప్లాయిమెంట్ అధికారి టి.అనిల్‌కుమార్, ప్రొఫెసర్ ఎస్సార్ సుభాని, సదస్సు కో-డైరెక్టర్ డాక్టర్ టి.నాగరాజు, డాక్టర్ జి.వీర్రాజు, డాక్టర్ వి.హరీష్, డాక్టర్ షేక్ సులేమాన్, డాక్టర్ కె.దేముడు, డాక్టర్ కె.సత్యనారాయణ, డాక్టర్ కె.రత్నరాజు, డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

22 నుంచి 'శాయ్' ట్రైనింగ్ సెంటర్ బాక్సింగ్, వాలీబాల్ ప్రవేశ ఎంపికలు

విశాఖపట్నం స్పోర్ట్స్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పోర్టు స్టేడియంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) ట్రైనింగ్ సెంటర్‌లో బాక్సింగ్, వాలీబాల్ క్రీడల్లో శిక్షణ పొందేందుకు ప్రవేశ ఎంపికలు ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్లు శాయ్ సెంటర్ ఇన్‌చార్జి ఎం.సత్యనారాయణ తెలిపారు. బాక్సింగ్ క్రీడకు సంబంధించి 12 నుంచి 14 ఏళ్లలోపు బాలురు 33 నుంచి 70 కిలోల వరకు లేదా ఆపైన బరువుతో రాష్ట్ర స్థాయిబాక్సింగ్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించి ఉండాలి. 14 నుంచి 15 ఏళ్లలోపు వారు 46 నుంచి 80 వరకు లేదా ఆపైన బరువుతో జాతీయ బాక్సింగ్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించి ఉండాలి. 16 ఏళ్ల పైబడినవారు 46 నుంచి 80 వరకు లేదా ఆపైన బరువు కలిగి జాతీయ బాక్సింగ్ టోర్నీలో పతకం సాధించి ఉండాలి. బాలికలకు సంబంధించి 12 నుంచి 14 ఏళ్లలోపు వారు 40 కిలోల బరువు కలిగి రాష్ట్ర స్థాయి బాక్సింగ్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించి ఉండాలి. 14 నుంచి 15 ఏళ్లలోపు వారు 56 వరకు లేదా ఆపై బరువుతో రాష్ట్ర స్థాయి బాక్సింగ్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించి ఉండాలి. 16 ఏళ్ల పైబడినవారు 56 వరకు లేదా ఆపై బరువు కలిగి జాతీయ బాక్సింగ్ టోర్నీలో పతకం సాధించి ఉండాలని స్పష్టం చేశారు. శిబిరానికి ఎంపికైనవారికి ఆధునిక శిక్షణ, వసతి, భోజనం, ఏడాదికి రూ.15 వేలు విలువ చేసే స్పోర్ట్సు కిట్, చదువు నిమిత్తం ఏడాదికి రూ.మూడు వేలు, పోటీల్లో పాల్గొనేందుకు ఏడాదికి రూ.5 వేలు, వైద్య ఖర్చులకు ఏడాదికి రూ.వెయ్యితో పాటు రూ.ఐదు లక్షల వరకు వైద్య బీమా కల్పిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఆధార్ కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, క్రీడా ధ్రువపత్రాలు, మెడికల్ ఫిట్‌నెస్ ధ్రువపత్రంతో హాజరుకావాలన్నారు. వివరాలకు బాలుర బాక్సింగ్‌కు ఫోన్:8019149804, బాలికల బాక్సింగ్‌కు ఫోన్:82474 43921లో సంప్రదించాలన్నారు.


ట్రాఫిక్ నియంత్రణ కోసం సర్కిల్ చుట్టూ ఏర్పాటు చేసిన మెస్

చురుగ్గా టీటీడీ సర్కిల్ ఆధునికీకరణ పనులు

- 45 రోజుల్లో పూర్తికి ప్రణాళిక

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ కూడలి వద్ద ఉన్న సర్కిల్‌కు ఆధునీకీకరణ పనులు చేపడుతున్నారు. ఈ పనుల వల్ల ట్రాఫిక్‌కు కొంత అంతరాయం ఏర్పడుతోంది. మూడు నెలల క్రితమే పనులు మొదలైనా ట్రాఫిక్‌ను నియంత్రించాల్సి ఉండడంతో కొన్నాళ్ల పాటు పనులు నిలిపేశారు. ఇప్పుడు త్వరితగతిన పనులు పూర్తి చేయాల్సి ఉంది. స్మార్ట్‌సిటీ పనుల్లో భాగంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో కూడళ్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. రంగురంగుల విద్యుత్ దీపాలు, వాటర్ ఫౌంటెన్లతో నగర అందాలకు కొత్త సొబగులు దిద్దుతున్నారు.

తాజాగా ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపం వద్ద ఉన్న సర్కిల్‌ను కూడా అభివృద్ధి చేయడానికి పనులు మొదలు పెట్టారు. టీటీడీ కూడలిగా పేరొందడంతో ఆ పేరుకు తగ్గట్లే సర్కిల్‌ను ఆధ్యాత్మిక కూడలిగా తీర్చి దిద్దడానికి అధికారులు నిర్ణయించారు. నాలుగు రోడ్ల కూడలి కావడంతో అన్ని వైపులకు కనిపించే విధంగా సర్కిల్ మధ్యలో గోవింద నామాలు ఏర్పాటు చేయనున్నారు.

ఈ కూడలి నిర్మాణానికి రూ.1.44 కోట్లు మంజూరైంది. సర్కిల్ చుట్టూ రోడ్డును తవ్వి, అందంగా కనిపించేందుకు తారు రోడ్డు బదులు స్టోన్ రోడ్డు నిర్మించనున్నారు. ఈ పనులు జరుగుతుండడంతో సర్కిల్ చుట్టూ పరదాలు కట్టేశారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇక్కడ నిత్యం రద్దీగానే ఉంటుంది. సాయంత్రం వేళ ఈ రద్దీ మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ సర్కిల్‌లో 45 రోజుల్లో పూర్తి చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు సహాయ ఇంజనీరు సుమన్ తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు

ద్వారకా బస్‌స్టేషన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు సూచించారు. సేఫ్ ఇంటర్నెట్ డే సందర్భంగా మంగళవారం విశాఖపట్నం డిపోలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్నెట్ వినియోగంతోపాటు ఆన్‌లైన్ మోసాలూ పెరుగుతున్నాయన్నారు. ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు వినియోగించుకునే వారు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. ఓటీపీ, పిన్ నెంబర్లు ఎవరికీ తెలియజేయరాదన్నారు. అపరిచితుల నుంచి వచ్చిన ఆన్‌లైన్ లింకులను తెరిస్తే మన బ్యాంక్ ఖాతాలో నగదు ఖాళీ అవుతుందన్నారు. ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ఆన్‌లైన్ వినియోగంపై పూర్తి అవగాహన తో ఉండాలన్నారు. ఈ సమావేశంలో విశాఖపట్నం, మద్దిలపాలెం డిపో మేనేజర్లు గంగాధర్, అరుణకుమారి, సూపర్ వైజర్లు రామకృష్ణ, ఉజ్వల, బిందు, మాధురి పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి తై పూజా మహోత్సవం


ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : శ్రీసుబ్రహ్మణ్య స్వామి భక్త బృందం అధ్వర్యంలో మంగళవారం తై పూజా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 500 మందికి పైగా భక్తులు మాలలు ధరించి చినవాల్తేరు ఈస్టు షిర్డీ సాయి బాబు ఆలయం, బొత్రా షిప్పింగ్ కంపెనీ సహాయ సహకారాలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు శూలాలు, కవిడలు, స్లాగులు, రథాలు, బుగ్గవేల్ ధరించి మేళతాళాలతో ఊరేగింపుగా చినవాల్తేరు ఈస్టు షిర్డీ సాయిబాబా ఆలయం నుంచి చినవాల్తేరు రజక వీధి, హోమన హోటల్, ప్రభుత్వ మానసిక ఆస్పత్రి, పెదవాల్తేరు గాంధీ బొమ్మ సెంటర్ తదితర ప్రాంతాల మీదుగా పెదవాల్తేరులో బజారులోని వినాయక గుడి వద్దకు చేరుకున్నారు. అనంతరం భక్తులు మాలలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసుబ్రహ్మణ్య స్వామి భక్త బృందం సభ్యులు, బైరెడ్డి పోతన్న రెడ్డి, కళ్ల శంకర్ పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి


సమావేశంలో మాట్లాడుతున్న పరశురామ్‌రాజు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ ఏకాత్మతా మానవతా వాదం సిద్ధాంత కర్త, భారతీయ జనసంఘ్ పూర్వ అధ్యక్షుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని మంగళవారం బీజేపీ నగర కార్యాలయంలో ఆ పార్టీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎల్ పరశురామ్ రాజు అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండిట్ దీనదయాళ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అయన మాట్లాడుతూ సుఖమంటే ఏమిటో తెలియక కష్టాలనే చవి చుస్తూ దేశ సేవకు నిమగ్నమై దానినే జీవన కార్యంగా మలచుకున్న పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సంఘటన్ ప్రధాన కార్యదర్శి తపనా చౌదరి, బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా మాజీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, బీజేపీ రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, బీజేపీ జిల్లా ఇన్‌చార్జి పుట్ట గంగయ్య, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగం ధనేశ్వరరావు ఇతర నాయకులు, కర్యకర్తలు పాల్గొన్నారు.

రూ.9 వేల పెన్షన్ ఇవ్వాలి

సిరిపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే పెన్షనర్స్‌కు కనీస పెన్షన్ నెలకు రూ.9 వేలతో పాటు పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకొని డీఏ చెల్లించాలని ఆలిండియా కో-ఆర్డినేషన్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్కే. హుస్సేన్ డిమాండ్ చేశారు. మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆలిండియా కో-ఆర్డినేషన్ కమిటీ అధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కట్-ఆఫ్ డేట్' లేకుండా అందరికీ హ్యర్ ఆప్షన్ పొందేందుకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ జిల్లా ఉపాధ్యక్షులు యువీఎస్ఎన్ వర్మ, రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకరరావు, ఎ.నారాయణరావు, తులసీరామ్, కుమార్‌మంగళం, పట్నాయక్, రాము, వెంకటరమణరావు పాల్గొన్నారు.

శశిధర్‌కు స్వర్ణ నంది పురస్కారం


ప్రముఖ సినీ నటుడు సుమన్ నుంచి పురస్కారం అందుకుంటున్న శశిధర్

రామ్‌నగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) :ఫ్యాషన్ రంగంలో యువతను ప్రోత్సహిస్తున్న వారిని మరింతగా తీర్చిదిద్దుతున్న డైరెక్టర్ శశిధర్ పైడిరాజా జాతీయ స్వర్ణ నంది అందుకున్నారు మంగళవారం రామ్‌నగర్ ఒక సమావేశం మందిరంలో శ్రీలంబోదర కల్చరల్ అకాడమీ, ఎస్‌కేఎస్ అకాడమీ సంయుక్తంగా శివానందలహరి పేరుతో సినీనటుడు సుమన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

బీజేపీ పటిష్టత ప్రతి ఒక్కరి బాధ్యత

పార్టీ శ్రేణులకు రాష్ట్ర సంఘటన్ మంత్రి మధుకర్ పిలుపు


వేదికపై మధుకర్ జీ, పరశురామ్‌రాజు తదితరులు, (దిగువ) సమావేశానికి హాజరైన బీజేపీ నేతలు, కార్యకర్తలు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ పటిష్టత కోసం ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సంఘటన్ మంత్రి ఎన్. మధుకర్ జి కోరారు. మంగళవారం బీజేపీ నగర కార్యాలయంలో బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామ్ రాజు ఆధ్వర్యంలో బీజేపీ విశాఖపట్నం జిల్లా సంస్థాగత సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల, బూత్ స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. దేశ రాజకీయాల్లో ప్రస్తుతం బీజేపీ ప్రముఖ పాత్ర నిర్వహిస్తోందని, ఈ తరుణంలో ఉత్సాహంగా పార్టీ శ్రేణులు పని చేయాలని పేర్కొన్నారు. గ్రామీణ స్థాయికి పార్టీని తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర జోనల్ ఇంచార్జి తపనా చౌదరి, విశాఖ ఉత్తర నియోజకవర్గం శాసన సభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పీవీఎన్ మాధవ్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్, బీజేపీ రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియో ఇన్‌చార్జి ఎ.కేశవకాంత్, బీజేపీ జిల్లా ఇన్‌చార్జి పుట్ట గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల గీతాలు అమరం : సినీ హీరో ఉపేంద్ర


ఘంటసాలకు నివాళులు అర్పిస్తున్న ఉపేంద్ర, సత్యప్రసాద్ వర్మ తదితరులు

రామ్‌నగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : అమర గాయకుడు ఘంటసాల గీతాలు అమరమని సినీ హీరో కంచర్ల ఉపేంద్ర పేర్కొన్నారు. ఘంటసాల 51వ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉపేంద్ర మాట్లాడు తూ సంగీత దర్శకుడిగా సినీ రంగానికి అనేక సేవలు అందించిన ఘంటసాల క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం అనుభవించిన దేశ భక్తుడన్నారు, ఆధాత్మికవేత్త భాస్కరభట్ల సత్యప్రసాద్ వర్మ మాట్లాడు తూ తన గాత్ర మాధుర్యం ద్వారా ఘంటసాల చిరంజీవిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో కంచర్ల అచ్యుతరావు అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు, బొమ్మిడి సత్యనారాయణ, మదుపాడ రమణి, ఇందిరా సాహిణి, నర్సింగ్ కెఎస్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వృక్షాల ఉసురు తీసిన తహసీల్దార్!

- కార్యాలయం ఆవరణలో పెరిగిన చెట్ల నరికివేత
- పెట్రోల్ బంక్ కోసం సిద్ధం చేసిన ఆవరణ
- విస్తుపోతున్న ప్రజలు.. సందర్శకులకు ఇక నీడ కరవే


అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో పచ్చదనం ఇచ్చే మర్రిచెట్టు. (ఫైల్ ఫోటో)

సీతమ్మధార, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణకు మొక్కలు పెంచాలన్న సంకల్పంతో చాలామంది ముందుకు వస్తుంటే, దీన్ని ప్రోత్సహించాల్సిన అధికారులు ప్రస్తుతం ఉన్న చెట్ల ఉసురు తీస్తున్నారు. సీతమ్మధార నక్కవానిపాలెంలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో దశాబ్దాల వయసున్న చెట్లను నామరూపాల్లేకుండా చేశారు. 1985లో అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని పోర్టు ఆర్థిక సహాయంతో నిర్మించారు. అప్పటికే చాలా సంవత్సరాల క్రితం నుంచి పెద్ద పెద్ద మర్రిచెట్లు ఆ కార్యాలయం ఆవరణలో ఉండేవి. ఆ చెట్ల కింద ఎంతోమంది సేదదీరేవారు. నక్కవానిపాలెం ఏర్పడక ముందు నుంచి ఈ చెట్లు ప్రత్యేక ఆకర్షణగా ఉండేవి. కొద్ది రోజుల క్రితం అర్బన్ తహసీల్దార్ రమేష్ పర్యవేక్షణలో వీటిపై గొడ్డలివేటు వేశారు. అత్యవసర పరిస్థితుల్లో తొలగించాల్సి వచ్చినా, కూకటి వేళ్లతో పెకలించి మరోచోట చెట్లను నిలబెడుతున్న ఆధునిక పద్ధతులు వచ్చిన నేటి రోజుల్లో, ఏకంగా వాటి ఉసురు తీయడం విడ్డూరం. అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ప్రారంభించిన 40 ఏళ్లలో పనిచేసిన తహసీల్దార్లు పచ్చదనం పెంపునకు, కార్యాలయం ఆవరణను శుభ్రంగా ఉంచడానికి ఎన్నో చర్యలు చేపట్టారు. కానీ ప్రస్తుత తహసీల్దార్ రమేష్ మాత్రం దశాబ్దాలపాటు ఎదిగిన చెట్లను కొన్ని గంటల్లో నేలకూల్చిన దుష్కీర్తిని మూటగట్టుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడానికి ఈ దారుణానికి ఒడిగట్టారు. చెట్లపై వేటు వేయాల్సి వస్తే ముందుగా జిల్లా కలెక్టర్, అటవీశాఖాధికారులు, జీవీఎంసీ కమిషనర్ల నుంచి అనుమతి తీసుకోవాలి. వారు అనుమతి ఇచ్చారా? తీసుకోకుండా వేటు వేశారా? కొట్టిన దుంగలను ఏం చేసినట్లు? ఒకవేళ విక్రయిస్తే ఆ డబ్బు ప్రభుత్వానికి జమ చేశారా? అన్నది తెలియాల్సి ఉంది. ఉన్నతాధికారులకు ఈ విషయం తెలిసినా అడ్డుకోకపోవడం శోచనీయం.

ఎవరి మెహర్బానీ కోసం ఈ వేటు?

పెట్రోల్ బంక్ ఏర్పాటు ప్రతిపాదనలు రావడంతో ఎన్నో ఏళ్లుగా ఉన్న పెద్ద చెట్లను నరికివేయించారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే సందర్శకులకు ఈ చెట్లు ఎంతో ఆహ్లాదాన్ని, హాయిని ఇచ్చేవి. కార్యాలయంలో పని అయ్యే వరకు చెట్ల నీడన హాయిగా కూర్చునేవారు. ఇకపై సందర్శకులకు నీడ కూడా కరవేనని, ఇబ్బందులకే కారణమవుతుందన్నది నిర్వివాదం. ఉత్తర్వు అందిన వెంటనే చెట్లు నరికి వేయించడం ఎవరి మెహర్బానీ కోసమో తెలియటం లేదని కార్యాలయానికి వచ్చే సందర్శకులు, సిబ్బంది చెవులు కొరుక్కుంటున్నారు. దీనిపై కలెక్టర్ స్పందించాలని పలువురు కోరుతున్నారు.


కార్యాలయం ఆవరణలో పెట్రోల్ బంక్ కోసం చెట్లు నరికేసి చదును చేసిన స్థలం

నిషిద్ధ సమయంలో భారీ వాహనాల రాకతో ఇబ్బందులు


మర్రిపాలెం వద్ద మంగళవారం ఉదయం రద్దీ సమయంలో ప్రవేశించిన లారీ

మర్రిపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి): నిషిద్ధ సమయాల్లో మర్రిపాలెం ప్రధాన రహదారిలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ఇష్టారాజ్యంగా రాకూడని సమయంలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. భారీ వస్తు సామగ్రితో వస్తున్న భారీ వాహనాలు రోడ్డుమధ్య నిలుపుతూ సరుకును దించుతున్నారని, ఈ కారణంగా రాకపోకలకు అంతరాయం కలుగుతోందని చెబుతున్నారు. ఉద్యోగులు, విద్యార్థులు వెళ్లే సమయాల్లో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నట్లు వాపోతున్నారు. అధికారులు స్పందించి నిషిద్ధ సమయాల్లో భారీ వాహనాల రాకపోకలను నిరోధించాలని కోరుతున్నారు.

మధుర గీతాలాపనతో ఘంటసాలకు నివాళి

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నేపథ్య గాయకుడు ఘంటసాల వేంకటేశ్వరరావు 50వ వర్ధంతి కార్యక్రమాన్ని రైల్వే ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయిధ్యానమందిరం ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గానసుధ గల్లా చిట్టిబాబు బృందంతో ఘంటసాల మధుర భక్తి గీతాలాపన జరిగింది. అనంతరం గాయకులను సత్కరించారు.

బాలయోగి కొండపై కమ్యూనిటీ హాలుకు వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న కొండప్రాంత నివాసితులు

మురళీనగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మాధవధార 50వ వార్డు కొండవాలు నివాసిత ప్రాంతం బాలయోగి కొండ వద్ద కమ్యూనిటీ హాలు నిర్మించాలని కోరుతూ మంగళవారం స్థానికులు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజుకు వినతిపత్రం అందజేశారు. కొండవాలు ప్రాంతాల్లో ప్రధాన సమస్యలుగా ఉన్న కాలువలు, వీధి దీపాలు, వీధి రోడ్లను నవీకరించి బాలయోగి కొండ నివాసితులకు వసతులు కల్పించాలని కోరారు. కాలనీ ప్రతినిధులు రామ్నాయుడు, బుజ్జి, భోజిరాజు, వార్డు టీడీపీ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, గ్రామ యువత హాజరయ్యారు.

రహదారి నియమాలు పాటిస్తేనే ప్రాణరక్షణ

మహారాణిపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ న్యాయవాదులు, ఆర్టీఏ అధికారులు, పోలీసులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. విశాఖపట్నం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు సమీపంలోని తెలుగుతల్లి విగ్రహం నుంచి నిర్వహించిన ర్యాలీని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ జగదాంబ జంక్షన్ మీదుగా పోలీసు కమిషనరేట్ కార్యాలయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కమిషనర్ బాగ్చి మాట్లాడుతూ గమ్యానికి సురక్షితంగా చేరుకోవాలంటే రహదారి భద్రత నియమాలను అందరూ కచ్చితంగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, పెద్ద వాహనాల వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని గుర్తుచేశారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదని సూచించారు. న్యాయవాదుల ద్వారా సమాజానికి భద్రత సందేశాన్ని అందించడం కోసం వారి భాగస్వామ్యంతో ర్యాలీ చేపట్టినట్లు డీటీసీ (ఇన్‌చార్జి) బాధ్యతలు చేపట్టిన ఆర్.సి.హెచ్.శ్రీనివాసరావు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వ్యక్తిగత భద్రత పాటించాలని కోరారు. జిల్లా కోర్టు నుంచి పోలీసు కమిషనరేట్ కార్యాలయం వరకు జరిగిన ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్ష, కార్యదర్శులు బి.సత్యనారాయణ, ఎస్.కృష్ణమోహన్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన ర్యాలీలో పాల్గొన్న పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, న్యాయవాదులు, రవాణా, పోలీసు అధికారులు తదితరులు

స్మార్ట్ స్ట్రీట్స్ అధ్వానం

... 5వ పేజీ తరువాయి

వ్యక్తమయ్యాయి. దీంతో కేవలం ఏడు కిలో మీటర్ల మేర ఐదు రోడ్లను మాత్రమే రూ.60 కోట్లతో స్మార్ట్‌స్ట్రీట్‌లుగా అభివృద్ధి చేయాలని జీవీఎస్‌సీసీఎల్ నిర్ణయించింది. ఈ మేరకు పెదవాల్తేరు జంక్షన్ నుంచి చినవాల్తేరు మార్గంలో ప్రభుత్వ మానసికవైద్యశాల జంక్షన్ వరకు ఉన్నరోడ్డు, పార్క్‌హోటల్ జంక్షన్ నుంచి పెదవాల్తేరు జంక్షన్ రోడ్డు, సిరిపురం జంక్షన్ నుంచి ఆల్‌ఇండియా రేడియో కేంద్రానికి ఇరువైపులా ఉన్న రెండు రోడ్లు, సిరిపురం జంక్షన్ నుంచి పాండురంగాపురం డౌన్ రోడ్డును స్మార్ట్‌స్ట్రీట్‌లుగా ఎంపిక చేశారు.

అధ్వానంగా మారిన వైనం

జీవీఎంసీ రూ.60 కోట్లు వెచ్చించి అభివృద్ధి చేసిన ఈ ఐదు రోడ్లలో ఒకటైన పెదవాల్తేరు జంక్షన్ నుంచి ప్రభుత్వ మానసిక వైద్యశాల జంక్షన్ రోడ్డు ప్రస్తుతం అధ్వానంగా మారింది. రోడ్డు పొడవునా అందమైన టైల్స్‌తో నిర్మించిన ఫుట్‌పాత్‌లు, సైక్లింగ్‌ట్రాక్‌లు, పార్కింగ్ స్థలాలను ఆక్రమించి దుకాణాలు, మెకానిక్ షెడ్లు, స్క్రాప్ గోడౌన్లను ఏర్పాటు చేశారు. స్మార్ట్‌స్ట్రీట్ ప్రాజెక్టు డిజైన్‌లో పేర్కొన్నట్టుగా ప్రజా వినియోగంలో ఉండేలా చూడాల్సిన జీవీఎంసీ, పోలీస్ అధికారులు ఆ బాధ్యతను విస్మరించడంతో ఆక్రమణదారులకు అడ్డులేకుండాపోయింది. వాకింగ్‌ట్రాక్, ఫుట్‌పాత్‌లను తవ్వేయడంతో రూ.కోట్లు వెచ్చించి వేసిన టైల్స్ పైకి లేచిపోయాయి. వాకింగ్‌ట్రాక్‌లు, ఫుట్‌పాత్‌లపై నడిచేందుకు చోటులేకపోవడంతో పాదచారులంతా రోడ్డుపైనే నడవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆ రోడ్డులో ఉన్న బస్టాప్‌లను కూడా ఆక్రమించి, దుకాణాలను ఏర్పాటు చేసుకోవడం పరిస్థితికి అద్దంపడుతోంది. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్మార్ట్‌స్ట్రీట్‌గా అభివృద్ధి చేసిన రోడ్డులో ఆక్రమణలను తొలగించి లక్ష్యానికి అనుగుణంగా తీర్చిదిద్దాల్సి ఉంది.

సత్యదేవుని దర్శనానికి తెరిచిన ఘాట్ రోడ్డు


భక్తులు నేరుగా క్యూలైన్లలోకి ప్రవేశించే ఘాట్ రోడ్డు

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం ఇసుక కొండ సత్యనారాయణ స్వామి దర్శనానికి వచ్చే భక్తుల కోసం పూర్ణామార్కెట్ మెయిన్‌రోడ్డు ఘాట్ రోడ్డు తెరిచినట్లు ఈవో రాజగోపాలరెడ్డి వెల్లడించారు. వాహనాల్లో వచ్చేవారు ఘాట్ రోడ్డు మార్గం గుండా ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొండపైకి చేరుకోవచ్చునన్నారు. కేజీహెచ్ ప్రధాన ద్వారం, ఏవీఎన్ కాలేజీ వెనుక ఆంధ్రా మెడికల్ కాలేజీ మార్గం పూర్తిగా నిషిద్ధమన్నారు. భక్తులు ఘాట్ రోడ్డు మార్గం గుండా కొండపైకి క్యూలైన్లలోకి చేరుకోవచ్చునన్నారు. భక్తులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పదో తరగతి పరీక్షల నిర్వహణకు సన్నద్ధంకండి

మహారాణిపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మార్చి 17 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా ఇన్‌చార్జి డీఆర్‌వో సీతారామారావు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 134 కేంద్రాల్లో 15,094 మంది బాలురు, 13,429 మంది బాలికలు పరీక్షలకు హాజరవుతారన్నారు. ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, అన్ని రకాల సాంకేతిక ప్రక్రియలు పూర్తి చేసి పరీక్షల నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలన్నారు. పరీక్షలు సజావుగా ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పోలీసు, రెవెన్యూ, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖ, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

సిటీలో ఫ్లూ ఫీవర్స్

... 5వ పేజీ తరువాయి

నెబిలైజేషన్ పెట్టాల్సి వస్తోందని తెలిపారు.

రోగుల సంఖ్య ఎక్కువే...

గొంతు నొప్పి, జలుబు, దగ్గుతో కేజీహెచ్, విమ్స్‌లకు ప్రతిరోజూ 40 మంది వరకూ వస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు వస్తున్నవారిలో దాదాపు 50 శాతం మందికి ఈ లక్షణాలున్నాయని వైద్యులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో ఎండతీవ్రత పెరిగే కొద్దీ కొన్ని వైరస్‌లు మరింత యాక్టివ్ అవుతాయని, దీనివల్ల కేసులు పెరుగుతాయని వైద్యులు చెబుతున్నారు.



తీవ్రతను బట్టి మందులిస్తున్నాం

ఫ్లూ కేసులు పెరిగాయి. తీవ్రతను బట్టి మందులు ఇస్తున్నాం. కొందరికి యాంటీ బయాటిక్స్ ఇవ్వాల్సి వస్తోంది. సీజన్ మారుతున్న సమయంలో ఫ్లూ వైరస్‌లు వ్యాప్తి చెందుతుంటాయి. ప్రస్తుత వైరస్ తీవ్రత కొంత బలంగా ఉన్నట్టు కనిపిస్తోంది. అందువల్ల రోజుల తరబడి లక్షణాలుంటున్నాయి. మూడు రోజులకు మించి దగ్గు, ఇతర లక్షణాలుంటే వైద్యులను సంప్రతించాలి.

- డాక్టర్ వై.జ్ఞానసుందరరాజు, జనరల్ మెడిసిన్ వైద్యులు

ఎంఎస్ఎంఈపై రేపు శివాజీపాలెంలో సదస్సు

మర్రిపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు సంబంధించిన రుణగ్రహీతలకు, రుణ దరఖాస్తుదారులకు అవగాహన కల్పించే నిమిత్తం పంజాబ్ నేషనల్ బ్యాంకు ఆధ్వర్యంలో ఈ నెల 13న శివాజీపాలెంలోని సవేర ఫంక్షన్ హాల్లో ఎంఎస్ఎంఈ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పంజాబ్ నేషనల్ బ్యాంకు విశాఖపట్నం సర్కిల్ హెడ్ వి.నీలిమ తెలిపారు. వివరాలకు 99488 56156 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

ఏయూ అంతర్ కళాశాల టార్గెట్‌బాల్ పోటీలు ప్రారంభం

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఏయూ అంతర్ కళాశాలల మహిళల, పురుషుల టార్గెట్ బాల్ టోర్నీ మంగళవారం ప్రారంభమైంది. గోల్డెన్ జూబ్లీ గ్రౌండ్‌లో ఈ పోటీలను వ్యాయామ విద్య క్రీడా సంచాలకుడు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ ప్రారంభించారు. క్రమశిక్షణ, ప్రతిభతో విజేతలుగా నిలవాలని సూచించారు. మహిళల విభాగంలో ఏవీఎన్ కాలేజి చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. పురుషుల విభాగంలో ఏవీఎన్ కాలేజి, ఏయూ ఆర్ట్స్ కాలేజి బుధవారం జరిగే ఫైనల్స్‌కు చేరాయి. ఫిజికల్ డైరక్టర్లు డాక్టర్ సంధ్యారాణి, ఎస్.గోపీకృష్ణ, టార్గెట్‌బాల్ సంఘం ప్రతినిధి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'పోర్టు ఆసుపత్రిని ప్రైవేటువారికి ఇవ్వొద్దు'

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పోర్టు ఆసుపత్రిని ప్రైవేటు వారికి ఇవ్వకుండా సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.జగన్ అన్నారు. పోర్టు ఆసుపత్రి ఎదుట కొనసాగిస్తున్న నిరసన దీక్ష మంగళవారం 134వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రి 150 పడకల సామర్థ్యంతో నిర్మించి ప్రస్తుతం 80 పడకలతో సమర్థంగా పోర్టు, డాక్ అధికారులకు, ఉద్యోగులకు, కార్మికులకు, రిటైర్డ్ ఉద్యోగులకు, కార్మికులకు దశాబ్దాల తరబడి 40 వేల కుటుంబాలకు సేవలందిస్తుందని గుర్తు చేశారు. అటువంటి పోర్టు ఆసుపత్రిని పీపీపీ పద్ధతిలో మల్టీ డిసిప్లినరీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా 300 పడకలతో ప్రైవేటు వారికి అప్పగించాలనే నిర్ణయం చాలా దుర్మార్గమన్నారు. ప్రైవేటు వారికిస్తే ఆరోగ్య భద్రతను వారి చేతుల్లో పెట్టడమే అవుతుందని పునరుద్ఘాటించారు. ఈ దీక్షలో నాయకులు జె.సత్యనారాయణ, కె.సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, మూర్తి, సీహెచ్‌వీఎస్ రెడ్డి, నరసింహ, రాఘవులు, నాయుడు పాల్గొన్నారు.



పోర్టు ఆసుపత్రి ఎదుట కొనసాగుతున్న నిరసన దీక్షలో నినదిస్తున్న ఉద్యోగులు

పూర్ణా మార్కెట్‌లో బినామీల దందా!

... 5వ పేజీ తరువాయి

మార్కెట్‌లో ఓ వ్యక్తి ఏదో ఒక అసోషియేషన్ పేరుతో హడావుడి చేస్తూ డీ సెక్షన్‌లోని ఆరు దుకాణాలు, సీ సెక్షన్‌లో ఒక దుకాణం, గ్యాంగ్‌వేజ్‌లో ఐదు దుకాణాలు, తావేజిలు కట్టే వరుసలో ఒక దుకాణాన్ని తన గుప్పిట్లో ఉంచుకున్నారు. మార్కెట్‌లో వ్యాపారం చేసే మరో వ్యక్తికి గ్యాంగ్‌వేజ్‌లో ఆరు దుకాణాలు, బి సెక్షన్‌లో రెండు, చేపలమార్కెట్‌లో ఒక దుకాణం ఉన్నాయి. మరో దళారీ పీ సెక్షన్‌లో మూడు, గ్యాంగ్‌వేజ్‌లో మూడు దుకాణాలు తన చేతిలో ఉంచుకున్నారు. కిరాణా దుకాణం నడిపే ఓ వ్యక్తి బి సెక్షన్‌లో మూడు దుకాణాలను కలిగి ఉన్నారు. ఇలా మరికొందరు రెండు కంటే ఎక్కువ దుకాణాలను చేజిక్కించుకుని వాటిని ఇతర వ్యాపారులకు అద్దెలకిచ్చి జేబులు నింపుకుంటున్నారు. ఈ విషయాలన్నీ అక్కడే ఉండి ప్రత్యక్షంగా పరిశీలించే వార్డు శానిటేషన్ ఉద్యోగికి తెలిసినా అభ్యంతరం చెప్పకపోవడం విశేషం.

బినామీల సమాచారం సేకరించాం

మార్కెట్‌లో కొంతమంది పదుల సంఖ్యలో దుకాణాలను తమ గుప్పిట్లో పెట్టుకున్నారనే సమాచారం ఉంది. దీనిపై ఆధారాలు సేకరిస్తున్నాం. దుకాణాలను రోజువారీ అద్దెకు ఇచ్చి జేబులు నింపుకుంటున్న దళారుల నుంచి స్వాధీనం చేసుకోవడానికి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. త్వరలోనే ఒకరికి ఒక దుకాణం మాత్రమే ఉండేలా ప్రక్షాళన చేస్తాం.

- ఎం.మల్లయ్యనాయుడు, జోన్-4 కమిషనర్

కంచరపాలెంలో నేటి నుంచి ఫార్మాసిస్టులకు నైపుణ్య శిక్షణ

కంచరపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో బుధవారం ఫార్మాసిస్టులకు ఉచితంగా నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు తెలిపారు. భారత ప్రభుత్వ లైఫ్ సైన్సెస్ సెక్టార్ వారి స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నాలుగు రోజులు తరగతులు నిర్వహిస్తారు. శిక్షణలో ఫార్మా కోవిజన్స్ కేస్ ప్రాసెసింగ్ అనే అంశంపై కూలంకషంగా చర్చిస్తారు. తరగతులకు హాజరయ్యేందుకు జిల్లా వ్యాప్తంగా 40 మంది ఫార్మాసిస్టులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు.


స్థానిక మహాత్మాగాంధీ జీవీఎంసీ పాఠశాల విద్యార్థులకు నాంది ఫౌండేషన్ మంగళవారం క్రీడా కిట్లు అందజేసింది. కిట్లు అందుకున్న విద్యార్థులతో ఫౌండేషన్ ప్రతినిధులు చాప జయలక్ష్మి, వరలక్ష్మి, హెచ్.ఎం.నాగభూషణం, ఉపాధ్యాయులు - ఆంధ్రజ్యోతి, అల్లిపురం

18 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ మండల పరిధి పిట్టవానిపాలెం శివారు ప్రాంతంలో 18 మద్యం సీసాలతో వెంపాడ ఆనందకుమార్‌ను దువ్వాడ పోలీసులు అరెస్టు చేసి, మద్యం స్వాధీనం చేసుకున్నారు. పిట్టవానిపాలెం గ్రామ దేవత పండగ సందర్భంగా దువ్వాడ ఎస్ఐ శ్రీనివాసరావు గ్రామంలో గస్తీ నిర్వహిస్తున్నారు. అక్రమ మద్యం ఎక్కువ పరిమాణంలో ఓ వ్యక్తి వద్ద ఉందన్న సమాచారంతో సిబ్బందితో వెళ్లి ఆనంద్‌కుమార్‌ను అరెస్టు చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నగరానికి 100 ఇ-బస్సులు

... 5వ పేజీ తరువాయి

డిపోల్లో 804 బస్సులు సేవలందిస్తుండగా, వాటిలో 35 కాలం చెల్లిన బస్సులున్నాయి. 13 లక్షల కిలోమీటర్లు తిరగడం, 15 సంవత్సరాల పాటు రవాణా సేవలు అందించిన బస్సులను కాలం చెల్లినవిగా గుర్తిస్తారు. అవి ప్రయాణికుల రవాణా సేవలకు వినియోగించరాదన్న నిబంధన ఉంది. ఇలాంటి బస్సులు వివిధ డిపోలు, గ్యారేజీల్లో ఉన్నాయి. అత్యవసర సమయాల్లో మాత్రమే వీటిని వినియోగిస్తున్నారు. ఎలక్ట్రికల్ బస్సులు అందుబాటులోకి వచ్చిన వెంటనే ఈ బస్సులను రవాణా సేవలనుంచి తొలగించి విజయనగరం సెంట్రల్ గ్యారేజీకి పంపుతామని రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. తిరుపతి- తిరుమల మధ్య ప్రవేశపెట్టిన ఎలక్ట్రికల్ బస్సులతో రవాణా సౌకర్యం మెరుగ్గా ఉండడంతో విశాఖలో వీటిని నడపాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఆలయ వార్షికోత్సవానికి నగర సీపీకి ఆహ్వానం


సీపీకి ఆహ్వాన పత్రిక అందిస్తున్న భరణికాన రాజు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సత్యసాయినగర్‌లో జరగనున్న విజయదుర్గ అమ్మవారి ఆలయ వార్షికోత్సవానికి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీని 45వ వార్డు టీడీపీ అధ్యక్షుడు భరణికాన రాజు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. సీపీకి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆయనను కలిసినవారిలో పీలా హరిప్రసాద్, సత్యసాయి సాంస్కృతిక సేవాసంఘం, గ్రామకమిటీ సభ్యులు ఉన్నారు.

ఆగమేఘాలపై పనులు..అయోమయంలో ప్రజలు!

కంచరపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు రెడ్డి కంచరపాలెం సన్‌రైజ్ క్లబ్ దుర్గాదేవి ఆలయం వద్ద ప్రధాన స్తంభంపై ఉన్న విద్యుత్ తీగలను కంచరపాలెం విద్యుత్ కార్యాలయం సిబ్బంది ఆగమేఘాలపై మార్చి పక్కకు జరపడంపై స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడ స్తంభాన్ని ఆనుకుని ఉన్న పాత భవనాన్ని తొలగించి నూతన భవన నిర్మాణం చేపట్టడానికి సంబంధిత వ్యక్తులు పనులు ప్రారంభించారు. భవన నిర్మాణానికి విద్యుత్ స్తంభం, తీగలు ఆటంకంగా మారాయి. దీంతో ఏమి జరిగిందో తెలియదు గాని విద్యుత్ సిబ్బంది మాత్రం ఒక్కరోజులో వైర్లు పక్కకు జరిపి కొత్తవి ఏర్పాటు చేశారు. ఏళ్ల తరబడి లోఓల్టేజి, పాడైపోయిన వైర్లు, విద్యుత్ కోతలతో సతమతమవుతున్న పరిసర వీధుల ప్రజలు విద్యుత్ సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలం వస్తే అధిక భారంతో తీగలు తెగి తరచూ విద్యుత్ సరఫరా ఆగిపోయినా పట్టించుకోని సిబ్బంది ఇలా కొత్త భవనాలు, నిర్మాణాలకు ఆటంకంగా ఉన్న వైర్లు, స్తంభాలను తొలగించడంలో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తమకు కాసులు కురిపించే పనులపై త్వరితగతిన స్పందించే అధికారులు, విద్యుత్ సిబ్బంది ప్రజా సమస్యలపై అదేరీతిలో చర్యలు తీసుకుంటే బాగుండేదని నిష్ఠూరమాడుతున్నారు. పలుకుబడి వర్గాలకు వత్తాసు పలకడం మానేసి ప్రజల సౌకర్యం గురించి పని చేయాలని చురకలంటించారు.


సన్‌రైజ్ క్లబ్ వద్ద విద్యుత్ వైర్లు మార్చుతున్న సిబ్బంది

అయ్యో...జింకలు!

... 5వ పేజీ తరువాయి

సంచరించని చోట్లకు వెళ్లినా ప్రమాదం ఉండదు. కానీ అటు ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల, ఇటు కంబాలకొండ మధ్యనుంచి వెళుతున్న జాతీయ రహదారి, మధురవాడ, పీఎంపాలెం, కొమ్మాది, ఆదర్శనగర్‌వైపు వచ్చే జింకలు ప్రమాదంలో చిక్కుకుంటున్నాయి. జాతీయ రహదారిని దాటి ఎండాడ, విశాఖ వ్యాలీ స్కూలు రోడ్డులో వెళ్లినపుడు వాహనాలు ఢీకొని ప్రాణాలు కోల్పోతున్నాయి. కంబాలకొండ అభయారణ్యానికి ఫెన్సింగ్‌లేని ప్రాంతాల నుంచి జింకలు జాతీయ రహదారిపైకి వస్తున్నాయి. ఆ సమయంలో వాహనాలపై వెళ్లేవారు కొందరు వాటిని చూసి, తిరిగి కంబాలకొండవైపు పంపుతుంటారు. భారీ వాహనాలు వేగంగా వెళ్లేటప్పుడు రోడ్డు దాటే క్రమంలో జింకలు ప్రమాదానికి గురవుతుంటాయి.

రక్షణ చర్యలు చేపట్టాలి

ప్రస్తుతం కంబాలకొండలో జింకల రక్షణపై అటవీశాఖ అప్రమత్తంకావాలని ప్రజలు కోరుతున్నారు. కంబాలకొండ చుట్టూ ఫెన్సింగ్ వేయడం, కొన్నిచోట్ల రక్షణ గోడలు నిర్మించాలని సూచిస్తున్నారు. అయితే కంబాలకొండలో భారీగా ఉన్న జింకల్లో కొన్నింటిని ఇతర అభయారణ్యాలకు తరలించాలని అధికారులు యోచిస్తున్నట్టు సమాచారం. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారని తెలిసింది. అయితే దీనికి కేంద్ర ప్రభుత్వం అనుమతి తప్పనిసరి. అప్పటివరకు కంబాలకొండ అభయారణ్యంలో జింకలకు రక్షణ కల్పించడంతోపాటు వేసవిలో తాగునీరు, ఆహారం కోసం గడ్డిని పెంచాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

ఉచిత శిక్షణకు సెమ్స్‌తో ఒప్పందం

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): టొయోట్సు రేర్ ఎర్త్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (టీఆర్ఈఐ) కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారిటైం, షిప్ బిల్డింగ్ (సెమ్స్) సహకారంతో 18 నుంచి 27 ఏళ్ల వయస్సు కలిగి ఐటీఐ ఫిట్టర్, డిప్లొమా మెకానికల్ ఇంటర్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వడానికి ఒప్పందం కుదిరింది. సీఎన్‌సీ ఆపరేటర్, ఇన్వెంటరీ కంట్రోలర్, వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్ తదితర ఉపాధి ఆధారిత శిక్షణ కార్యక్రమాల్లో 75 మందికి రెండు నెలలు శిక్షణ ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు సంస్థ సీఈవో సేతు మాధవన్ తెలిపారు. ఆసక్తి కలిగిన విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల నిరుద్యోగ అభ్యర్థులు ఈ నెల 17లోపు దరఖాస్తు చేసుకునేందుకు సింధియా జంక్షన్ లోని సెమ్స్ కేంద్రంలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ :86884 11100, 83319 01237లో సంప్రదించాలన్నారు. టీఆర్ ఈఐ మేనేజింగ్ డైరెక్టర్ కోయిచి సాటో, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ బి. మురళీధరరావు, సెమ్స్ సీవోవో గోపీకృష్ణ, శివం పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో శైలజకు స్వర్ణ పతకాలు


శైలజను అభినందిస్తున్న మధుకుమార్, లక్ష్మణరెడ్డి తదితరులు

విశాఖపట్నం స్పోర్ట్స్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఓపెన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ మీట్‌లో బుల్లయ్య కళాశాల విద్యార్థిని బి.శైలజ మూడు స్వర్ణ పతకాలు కైవసం చేసుకుంది. విజయవాడలో జరిగిన ఈ టోర్నీ అండర్-18 మహిళల 60 మీ., 200 మీ. పరుగులో ప్రథమ స్థానంతో స్వర్ణ పతకాలు సొంతం చేసుకున్న శైలజ...4+400 రిలే రేస్‌లోనూ వేగవంతమైన పరుగు తీసి స్వర్ణ పతకం సాధించింది. మీట్ ఉత్తమ అథ్లెట్ అవార్డు అందుకుంది. మంగళవారం కళాశాల కార్యదర్శి డాక్టర్ జి.మధుకుమార్ తన కార్యాలయంలో శైలజను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బీఆర్ఎస్ లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

'విశ్వగురు' బిరుదుపై హర్షం

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మహా కుంభమేళాలో ఇస్కాన్, ప్రపంచవ్యాప్త హరేకృష్ణ ఉద్యమ వ్యవస్థాపక ఆచార్యులు భక్తి వేదాంత స్వామి ప్రభుపాదులకు 'విశ్వగురు' బిరుదును అఖిల భారతీయ అఖారా పరిషద్ ప్రదానం చేసిన సందర్భంగా నగరంలోని హరేకృష్ణ మూవ్‌మెంట్ హర్షం వ్యక్తం చేసింది.

పురాతన నిర్మాణ పద్ధతిలో అప్పన్న ఆలయ మరమ్మతులు

- ఆలయ పైకప్పు వర్షపు లీకేజీల నివారణకు చర్యలు
- తొలి విడతగా రూ.4 కోట్ల చెక్ అందజేసిన పుణెకు చెందిన వేంకటేశ్వరరావు
- సంస్థ ప్రతినిధులతో ఎమ్మెల్యే గంటా ఒప్పందం


ఎంవోయూ పత్రాలు అందుకుంటున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, దేవస్థానం ఈవో, సంస్థ ప్రతినిధులు

సింహాచలం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : సింహాచల వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ పై కప్పు నుంచి వర్షపు నీటి లీకేజీలు అరికట్టి శాశ్వత చర్యలు చేపట్టేందుకు పుణెకు చెందిన లార్డు వేంకటేశ్వర చారిటబుల్ అండ్ రిలిజియస్ ట్రస్టు ముందుకు వచ్చింది. కొన్ని శతాబ్దాల క్రితం మనదేశంలో సివిల్ నిర్మాణాలు చేపట్టిన ఈ సంస్థ సనాతన విధానంలో మరమ్మతులు చేయడానికి పూనుకొంది. అందుకు సంబంధించిన ఎంవోయును సంస్థ ప్రతినిధులతో భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు మంగళవారం సింహగిరిపై దేవస్థానం ఈవో వేంద్ర త్రినాథరావుతో కలిసి మార్చుకున్నారు. పుణెకు చెందిన వేంకటేశ్వరరావు అనే భక్తుడు సింహగిరి ఆలయ మరమ్మతులకు ఎంతైనా వెచ్చించేందుకు ముందుకు వచ్చారు. ఇందుకోసం తొలి విడతగా రూ.4 కోట్ల చెక్‌ను గంటా సమక్షంలో దేవస్థానం ఈవోకు అందజేశారు. కొన్ని దశాబ్దాలుగా కాస్త వర్షం కురిసినా అప్పన్న ఆలయంలోకి నీరు చేరడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

దేవస్థానం అధికారులు ఎన్నిసార్లు ఆధునిక విధానాల్లో మరమ్మతులు చేపట్టినా ఫలించలేదు. ఈ విషయం తెలుసుకున్న తిరుమలవాసి, పురావస్తు శాఖ డైరెక్టర్ చొరవ తీసుకుని పుణెకు చెందిన వేంకటేశ్వర చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు వేంకటేశ్వరరావుకు విషయాన్ని వివరించారు. ఆయన తక్షణం అప్పన్న ఆలయ మరమ్మతులు చేపట్టేందుకు కావాల్సిన ఆర్థిక సహాయాన్ని అందజేసేందుకు ముందుకు వచ్చారు. దాంతో మునిరత్నం రెడ్డి పర్యవేక్షణలో పురాతన రాజులు నిర్మించిన కట్టడానికి ఎటువంటి మార్పులు చేయకుండా సుమారు వెయ్యేళ్ల క్రితం నాటి విధానంతో మరమ్మతులు చేపట్టాని సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసింది.

తాజాగా సింహాద్రినాథుడి ఆలయ మరమ్మతు పనుల్లో సిమెంటును వినియోగానికి పూర్తిగా స్వస్తి పలుకుతున్నట్టు సంస్థ ప్రతినిదులు, పురావస్తు శాఖ అధికారులు నిర్ణయించుకున్నారు. పూర్వీకుల కాలంలో నిర్మాణాలకు చేపట్టిన తరహాలో ఒక ప్రత్యేక మిశ్రమాన్ని తయారు చేయనున్నారు. సున్నం, ఆఫ్రికా నుంచి దిగుమతి చేసుకునే విశేష గుణాలున్న కాల్చిన మట్టి, బెల్లం, కరక్కాయ పొడి, ఇటుకల పొడి, ప్రత్యేక చెట్ల నుంచి వచ్చే గమ్(బంక)ను వినియోగించనున్నారు. వీటన్నింటినీ కలిపి ప్రత్యేక డ్రమ్‌ల్లో నానబెట్టి ఇసుకతో కలిపి మిశ్రమాన్ని సిద్ధం చేస్తారు. పూణె సంస్థ కార్మికులతో పనులను రెండు వారాల్లో ప్రారంభించనున్నట్టు సంస్థ ప్రతినిధి ప్రకటించారు. ఎంవోయూ ప్రకారం పనులను 9 నెలల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎంవోయూ అందజేసే కార్యక్రమంలో దేవస్థానం ఈఈ డీజీ శ్రీనివాసరాజు, 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం తదితరులు పాల్గొన్నారు.


ట్రాఫిక్ నియంత్రణ కోసం సర్కిల్ చుట్టూ ఏర్పాటు చేసిన మెస్

చురుగ్గా టీటీడీ సర్కిల్ ఆధునికీకరణ పనులు

- 45 రోజుల్లో పూర్తికి ప్రణాళిక

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ కూడలి వద్ద ఉన్న సర్కిల్‌కు ఆధునీకీకరణ పనులు చేపడుతున్నారు. ఈ పనుల వల్ల ట్రాఫిక్‌కు కొంత అంతరాయం ఏర్పడుతోంది. మూడు నెలల క్రితమే పనులు మొదలైనా ట్రాఫిక్‌ను నియంత్రించాల్సి ఉండడంతో కొన్నాళ్ల పాటు పనులు నిలిపేశారు. ఇప్పుడు త్వరితగతిన పనులు పూర్తి చేయాల్సి ఉంది. స్మార్ట్‌సిటీ పనుల్లో భాగంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో కూడళ్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. రంగురంగుల విద్యుత్ దీపాలు, వాటర్ ఫౌంటెన్లతో నగర అందాలకు కొత్త సొబగులు దిద్దుతున్నారు.

తాజాగా ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపం వద్ద ఉన్న సర్కిల్‌ను కూడా అభివృద్ధి చేయడానికి పనులు మొదలు పెట్టారు. టీటీడీ కూడలిగా పేరొందడంతో ఆ పేరుకు తగ్గట్లే సర్కిల్‌ను ఆధ్యాత్మిక కూడలిగా తీర్చి దిద్దడానికి అధికారులు నిర్ణయించారు. నాలుగు రోడ్ల కూడలి కావడంతో అన్ని వైపులకు కనిపించే విధంగా సర్కిల్ మధ్యలో గోవింద నామాలు ఏర్పాటు చేయనున్నారు.

ఈ కూడలి నిర్మాణానికి రూ.1.44 కోట్లు మంజూరైంది. సర్కిల్ చుట్టూ రోడ్డును తవ్వి, అందంగా కనిపించేందుకు తారు రోడ్డు బదులు స్టోన్ రోడ్డు నిర్మించనున్నారు. ఈ పనులు జరుగుతుండడంతో సర్కిల్ చుట్టూ పరదాలు కట్టేశారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఇక్కడ నిత్యం రద్దీగానే ఉంటుంది. సాయంత్రం వేళ్ల ఈ రద్దీ మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ సర్కిల్‌లో 45 రోజుల్లో పూర్తి చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు సహాయ ఇంజనీరు సుమన్ తెలిపారు.

గ్రామీణ ప్రజాజీవనం మెరుగు పడాలి

ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు


సదస్సులో ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు, పాల్గొన్న ప్రొఫెసర్లు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ భారతంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు కావాలని ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఆర్ రాజు అన్నారు. ఏయూ రాజనీతి, ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు 'రోల్ అండ్ రిలవెన్స్ ఆఫ్ ది పార్లర్ బాడీస్ ఇన్ రూరల్ లోకల్ గవర్నమెంట్'ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సహకారంతో ఈ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సదుపాయాల కల్పన దిశగా కృషి జరగాలని సూచించారు. ఈ ప్రక్రియలో స్థానిక సంస్థలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంపూర్ణ సహకారం, స్వేచ్ఛను అందించాల్సిన అవసరం ఉందన్నారు. పోషక ఆహార లోపం, అనారోగ్యం, మానసిక సమస్యలు వంటివి గ్రామీణ ప్రాంతాల ప్రజలను సైతం ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. ఈ సమస్యలను పరిష్కరించే దిశగా నిపుణులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు.

ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు మాట్లాడుతూ రెండు రోజుల జాతీయ సదస్సులో భాగంగా 250కి పైగా పరిశోధనా పత్రాలను పరిశోధకులు సమర్పించారని తెలిపారు. వర్తమాన ప్రాధాన్యం కలిగిన అంశంపై ఈ సదస్సును నిర్వహించడం జరిగిందన్నారు. స్థానిక సంస్థల అభివృద్ధి, పటిష్టత, ప్రాధాన్యతలను ఈ సదస్సులో చర్చించినట్టు వివరించారు. సదస్సు డైరెక్టర్ పి.ప్రేమానందం మాట్లాడుతూ సదస్సులో భాగంగా ఎనిమిది సెషన్స్ నిర్వహించినట్టు చెప్పారు. అత్యుత్తమ ప్రమాణాలు కలిగిన పరిశోధనా పత్రాలను సదస్సులో సమర్పించినట్టు వివరించారు. సుస్థిర అభివృద్ధికి, గ్రామీణ ప్రగతికి స్థానిక సంస్థల కృషి ఎంతో అవసరమన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ, అధికారుల ప్రాముఖ్యతను వివరించారు. స్థానిక సంస్థలకు తగినన్ని నిధులు అందించడం లేదని, అధికారులను తగ్గిస్తూ వీటిని నిర్వీర్యం చేసే ప్రక్రియ జరగడం విచారకరమన్నారు. కార్యక్రమంలో రీజనల్ ఎంప్లాయిమెంట్ అధికారి టి.అనిల్‌కుమార్, ప్రొఫెసర్ ఎస్సార్ సుభాని, సదస్సు కో-డైరెక్టర్ డాక్టర్ టి.నాగరాజు, డాక్టర్ జి.వీర్రాజు, డాక్టర్ వి.హరీష్, డాక్టర్ షేక్ సులేమాన్, డాక్టర్ కె.దేముడు, డాక్టర్ కె.సత్యనారాయణ, డాక్టర్ కె.రత్నరాజు, డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

22 నుంచి 'శాయ్' ట్రైనింగ్ సెంటర్ బాక్సింగ్, వాలీబాల్ ప్రవేశ ఎంపికలు

విశాఖపట్నం స్పోర్ట్స్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పోర్టు స్టేడియంలోని స్పోర్ట్సు అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) ట్రైనింగ్ సెంటర్‌లో బాక్సింగ్, వాలీబాల్ క్రీడల్లో శిక్షణ పొందేందుకు ప్రవేశ ఎంపికలు ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్లు శాయ్ సెంటర్ ఇన్‌చార్జి ఎం.సత్యనారాయణ తెలిపారు. బాక్సింగ్ క్రీడకు సంబంధించి 12 నుంచి 14 ఏళ్లలోపు బాలురు 33 నుంచి 70 కిలోల వరకు లేదా ఆపైన బరువుతో రాష్ట్ర స్థాయిబాక్సింగ్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించి ఉండాలి. 14 నుంచి 15 ఏళ్లలోపు వారు 46 నుంచి 80 వరకు లేదా ఆపైన బరువుతో జాతీయ బాక్సింగ్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించి ఉండాలి. 16 ఏళ్లు పైబడినవారు 46 నుంచి 80 వరకు లేదా ఆపైన బరువు కలిగి జాతీయ బాక్సింగ్ టోర్నీలో పతకం సాధించి ఉండాలి. బాలికలకు సంబంధించి 12 నుంచి 14 ఏళ్లలోపు వారు 40 కిలోల బరువు కలిగి రాష్ట్ర స్థాయి బాక్సింగ్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించి ఉండాలి. 14 నుంచి 15 ఏళ్లలోపు వారు 56 వరకు లేదా ఆపై బరువుతో రాష్ట్ర స్థాయి బాక్సింగ్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించి ఉండాలి. 16 ఏళ్లు పైబడినవారు 56 వరకు లేదా ఆపై బరువు కలిగి జాతీయ బాక్సింగ్ టోర్నీలో పతకం సాధించి ఉండాలని స్పష్టం చేశారు. శిబిరానికి ఎంపికైనవారికి ఆధునిక శిక్షణ, వసతి, భోజనం, ఏడాదికి రూ.15 వేలు విలువ చేసే స్పోర్ట్సు కిట్, చదువు నిమిత్తం ఏడాదికి రూ.మూడు వేలు, పోటీల్లో పాల్గొనేందుకు ఏడాదికి రూ.5 వేలు, వైద్య ఖర్చులకు ఏడాదికి రూ.వెయ్యితో పాటు రూ.ఐదు లక్షల వరకు వైద్య బీమా కల్పిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఆధార్ కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, క్రీడా ధ్రువపత్రాలు, మెడికల్ ఫిట్‌నెస్ ధ్రువపత్రంతో హాజరుకావాలన్నారు. వివరాలకు బాలుర బాక్సింగ్‌కు ఫోన్:8019149804, బాలికల బాక్సింగ్‌కు ఫోన్:82474 43921లో సంప్రదించాలన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు

ద్వారకా బస్‌స్టేషన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు సూచించారు. సేఫ్ ఇంటర్నెట్ డే సందర్భంగా మంగళవారం విశాఖపట్నం డిపోలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్నెట్ వినియోగంతోపాటు ఆన్‌లైన్ మోసాలూ పెరుగుతున్నాయన్నారు. ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు వినియోగించుకునే వారు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. ఓటీపీ, పిన్ నెంబర్లు ఎవరికీ తెలియజేయరాదన్నారు. అపరిచితుల నుంచి వచ్చిన ఆన్‌లైన్ లింకులను తెరిస్తే మన బ్యాంక్ ఖాతాలో నగదు ఖాళీ అవుతుందన్నారు. ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ఆన్‌లైన్ వినియోగంపై పూర్తి అవగాహన తో ఉండాలన్నారు. ఈ సమావేశంలో విశాఖపట్నం, మద్దిలపాలెం డిపో మేనేజర్లు గంగాధర్, అరుణకుమారి, సూపర్ వైజర్లు రామకృష్ణ, ఉజ్వల, బిందు, మాధురి పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి తై పూజా మహోత్సవం


ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : శ్రీసుబ్రహ్మణ్య స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో మంగళవారం తై పూజా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 500 మందికి పైగా భక్తులు మాలలు ధరించి చినవాల్తేరు ఈస్టు షిర్డీ సాయిబాబు ఆలయం, బొత్రా షిప్పింగ్ కంపెనీ సహాయ సహకారాలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు శూలాలు, కవిడలు, స్లాగులు, రథాలు, బుగ్గవేల్ ధరించి మేళతాళాలతో ఊరేగింపుగా చినవాల్తేరు ఈస్టు షిర్డీ సాయిబాబా ఆలయం నుంచి చినవాల్తేరు రజక వీధి, హోమన హోటల్, ప్రభుత్వ మానసిక ఆస్పత్రి, పెదవాల్తేరు గాంధీ బొమ్మ సెంటర్ తదితర ప్రాంతాల మీదుగా పెదవాల్తేరులో బజారులోని వినాయక గుడి వద్దకు చేరుకున్నారు. అనంతరం భక్తులు మాలలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసుబ్రహ్మణ్య స్వామి భక్త బృందం సభ్యులు, బైరెడ్డి పోతన్న రెడ్డి, కళ్ల శంకర్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **తండేల్ :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ(గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ),
- **భవానీ వార్డ్ :** జగదాంబ, రమాదేవి
- **మదగజరాజా :** జగదాంబ, వెంకటేశ్వర-1, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),
- **సంక్రాంతికి వస్తున్నాం :** శారద, మెలోడి, జగదాంబ, కిన్నెర, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి


సమావేశంలో మాట్లాడుతున్న పరశురామ్‌రాజు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ ఏకాత్మతా మానవతా వాదం సిద్ధాంత కర్త, భారతీయ జనసంఘ్ పూర్వ అధ్యక్షుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని మంగళవారం బీజేపీ నగర కార్యాలయంలో ఆ పార్టీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎల్ పరశురామ్ రాజు అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండిట్ దీనదయాళ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అయన మాట్లాడుతూ సుఖమంటే ఏమిటో తెలియక కష్టాలనే చవి చుస్తూ దేశ సేవకు నిమగ్నమై దానినే జీవన కార్యంగా మలచుకున్న పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సంఘటన్ ప్రధాన కార్యదర్శి తపనా చౌదరి, బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా మాజీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, బీజేపీ రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, బీజేపీ జిల్లా ఇన్‌చార్జి పుట్ట గంగయ్య, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగం ధనేశ్వరరావు ఇతర నాయకులు, కర్యకర్తలు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 10, వంకాయలు (తెలుపు)16, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 36, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 12, క్యాబేజి 12, క్యారెట్ 24 దొండకాయలు 30, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)40, బరబాటి 34, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 62, బద్దచిక్కుడు 26, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 130, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 40, కీరదోస 26, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 32 చిలగడదుంపలు 38, కంద 68, దేముడు చిక్కుడు 28, గోరు చిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, క్రరపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు


కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	96
లైవ్ ధర	116
విత్ స్కిన్	202
స్కిన్‌లెస్	212

రూ.9 వేల పెన్షన్ ఇవ్వాలి

సిరిపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే పెన్షనర్స్‌కు కనీస పెన్షన్ నెలకు రూ.9 వేలతో పాటు పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకొని డీఏ చెల్లించాలని ఆలిండియా కో-ఆర్డినేషన్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్కే. హుస్సేన్ డిమాండ్ చేశారు. మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆలిండియా కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కట్-ఆఫ్ డేట్ లేకుండా అందరికీ హ్యర్ ఆప్షన్ పొందేందుకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ జిల్లా ఉపాధ్యక్షులు యువీఎస్ఎన్ వర్మ, రాష్ట్ర కార్యదర్శి కె. సుధాకరరావు, ఎ.నారాయణరావు, తులసీరామ్, కుమార్‌మంగళం, పట్నాయక్, రాము, వెంకటరమణరావు పాల్గొన్నారు.

శశిధర్‌కు స్వర్ణ నంది పురస్కారం


ప్రముఖ సినీ నటుడు సుమన్ నుంచి పురస్కారం అందుకుంటున్న శశిధర్

రామ్‌నగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) :ఫ్యాషన్ రంగంలో యువతను ప్రోత్సహిస్తున్న వారిని మరింతగా తీర్చిదిద్దుతున్న డైరెక్టర్ శశిధర్ పైడిరాజా జాతీయ స్వర్ణ నంది అందుకున్నారు మంగళవారం రామ్‌నగర్ ఒక సమావేశం మందిరంలో శ్రీలంబోదర కల్చరల్ అకాడమీ, ఎస్‌కేఎస్ అకాడమీ సంయుక్తంగా శివానందలహరి పేరుతో సినీనటుడు సుమన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

బీజేపీ పటిష్టత ప్రతి ఒక్కరి బాధ్యత

పార్టీ శ్రేణులకు రాష్ట్ర సంఘటన్ మంత్రి మధుకర్ పిలుపు


వేదికపై మధుకర్ జీ, పరశురామ్‌రాజు తదితరులు, (దిగువ) సమావేశానికి హాజరైన బీజేపీ నేతలు, కార్యకర్తలు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ పటిష్టత కోసం ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సంఘటన్ మంత్రి ఎన్. మధుకర్ జి కోరారు. మంగళవారం బీజేపీ నగర కార్యాలయంలో బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామ్ రాజు ఆధ్వర్యంలో బీజేపీ విశాఖపట్నం జిల్లా సంస్థాగత సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల, బూత్ స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. దేశ రాజకీయాల్లో ప్రస్తుతం బీజేపీ ప్రముఖ పాత్ర నిర్వహిస్తోందని, ఈ తరుణంలో ఉత్సాహంగా పార్టీ శ్రేణులు పని చేయాలని పేర్కొన్నారు. గ్రామీణ స్థాయికి పార్టీని తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర జోనల్ ఇంచార్జి తపనా చౌదరి, విశాఖ ఉత్తర నియోజకవర్గం శాసన సభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పీవీఎన్ మాధవ్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్, బీజేపీ రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎ. కేశవకాంత్, బీజేపీ జిల్లా ఇన్‌చార్జి పుట్ట గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల గీతాలు అమరం : సినీ హీరో ఉపేంద్ర


ఘంటసాలకు నివాళులు అర్పిస్తున్న ఉపేంద్ర, సత్యప్రసాద్ వర్మ తదితరులు

రామ్‌నగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : అమర గాయకుడు ఘంటసాల గీతాలు అమరమని సినీ హీరో కంచర్ల ఉపేంద్ర పేర్కొన్నారు. ఘంటసాల 51వ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉపేంద్ర మాట్లాడు తూ సంగీత దర్శకుడిగా సినీ రంగానికి అనేక సేవలు అందించిన ఘంటసాల క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం అనుభవించిన దేశ భక్తుడన్నారు, ఆధ్యాత్మికవేత్త భాస్కరభట్ల సత్యప్రసాద్ వర్మ మాట్లాడు తూ తన గాత్ర మాధుర్యం ద్వారా ఘంటసాల చిరంజీవిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో కంచర్ల అచ్యుతరావు అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు, బొమ్మిడి సత్యనారాయణ, మదుపాడ రమణి, ఇందిరా సాహిణి, నర్సింగ్ కెఎస్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వృక్షాల ఉసురు తీసిన తహసీల్దార్!

- కార్యాలయం ఆవరణలో పెరిగిన చెట్ల నరికివేత
- పెట్రోల్ బంక్ కోసం సిద్ధం చేసిన ఆవరణ
- విస్తుపోతున్న ప్రజలు.. సందర్శకులకు ఇక నీడ కరవే


అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో పచ్చదనం ఇచ్చే మర్రిచెట్టు. (ఫైల్ ఫోటో)

సీతమ్మధార, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణకు మొక్కలు పెంచాలన్న సంకల్పంతో చాలామంది ముందుకు వస్తుంటే, దీన్ని ప్రోత్సహించాల్సిన అధికారులు ప్రస్తుతం ఉన్న చెట్ల ఉసురు తీస్తున్నారు. సీతమ్మధార నక్కవానిపాలెంలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో దశాబ్దాల వయసున్న చెట్లను నామరూపాల్లేకుండా చేశారు. 1985లో అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని పోర్టు ఆర్థిక సహాయంతో నిర్మించారు. అప్పటికే చాలా సంవత్సరాల క్రితం నుంచి పెద్ద పెద్ద మర్రిచెట్లు ఆ కార్యాలయం ఆవరణలో ఉండేవి. ఆ చెట్ల కింద ఎంతోమంది సేదదీరేవారు. నక్కవానిపాలెం ఏర్పడక ముందు నుంచి ఈ చెట్లు ప్రత్యేక ఆకర్షణగా ఉండేవి. కొద్ది రోజుల క్రితం అర్బన్ తహసీల్దార్ రమేష్ పర్యవేక్షణలో వీటిపై గొడ్డలివేటు వేశారు. అత్యవసర పరిస్థితుల్లో తొలగించాల్సి వచ్చినా, కూకటి వేళ్లతో పెకలించి మరోచోట చెట్లను నిలబెడుతున్న ఆధునిక పద్ధతులు వచ్చిన నేటి రోజుల్లో, ఏకంగా వాటి ఉసురు తీయడం విడ్డూరం. అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ప్రారంభించిన 40 ఏళ్లలో పనిచేసిన తహసీల్దార్లు పచ్చదనం పెంపునకు, కార్యాలయం ఆవరణను శుభ్రంగా ఉంచడానికి ఎన్నో చర్యలు చేపట్టారు. కానీ ప్రస్తుత తహసీల్దార్ రమేష్ మాత్రం దశాబ్దాలపాటు ఎదిగిన చెట్లను కొన్ని గంటల్లో నేల కూల్చిన దుష్కీర్తిని మూటగట్టుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడానికి ఈ దారుణానికి ఒడిగట్టారు. చెట్లపై వేటు వేయాల్సి వస్తే ముందుగా జిల్లా కలెక్టర్, అటవీశాఖాధికారులు, జీవీఎంసీ కమిషనర్ల నుంచి అనుమతి తీసుకోవాలి. వారు అనుమతి ఇచ్చారా? తీసుకోకుండా వేటు వేశారా? కొట్టిన దుంగలను ఏం చేసినట్లు? ఒకవేళ విక్రయిస్తే ఆ డబ్బు ప్రభుత్వానికి జమ చేశారా? అన్నది తెలియాల్సి ఉంది. ఉన్నతాధికారులకు ఈ విషయం తెలిసినా అడ్డుకోకపోవడం శోచనీయం.

ఎవరి మెహర్బానీ కోసం ఈ వేటు?

పెట్రోల్ బంక్ ఏర్పాటు ప్రతిపాదనలు రావడంతో ఎన్నో ఏళ్లుగా ఉన్న పెద్ద చెట్లను నరికివేయించారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే సందర్శకులకు ఈ చెట్లు ఎంతో ఆహ్లాదాన్ని, హాయిని ఇచ్చేవి. కార్యాలయంలో పని అయ్యే వరకు చెట్ల నీడన హాయిగా కూర్చునేవారు. ఇకపై సందర్శకులకు నీడ కూడా కరవేనని, ఇబ్బందులకే కారణమవుతుందన్నది నిర్వివాదం. ఉత్తర్వు అందిన వెంటనే చెట్లు నరికి వేయించడం ఎవరి మెహర్బానీ కోసమో తెలియటం లేదని కార్యాలయానికి వచ్చే సందర్శకులు, సిబ్బంది చెవులు కొరుక్కుంటున్నారు. దీనిపై కలెక్టర్ స్పందించాలని పలువురు కోరుతున్నారు.


కార్యాలయం ఆవరణలో పెట్రోల్ బంక్ కోసం చెట్లు నరికేసి చదును చేసిన స్థలం

నిషిద్ధ సమయంలో భారీ వాహనాల రాకతో ఇబ్బందులు


మర్రిపాలెం వద్ద మంగళవారం ఉదయం రద్దీ సమయంలో ప్రవేశించిన లారీ

మర్రిపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి): నిషిద్ధ సమయాల్లో మర్రిపాలెం ప్రధాన రహదారిలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ఇష్టారాజ్యంగా రాకూడని సమయంలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. భారీ వస్తు సామగ్రితో వస్తున్న భారీ వాహనాలు రోడ్డుమధ్య నిలుపుతూ సరుకును దించుతున్నారని, ఈ కారణంగా రాకపోకలకు అంతరాయం కలుగుతోందని చెబుతున్నారు. ఉద్యోగులు, విద్యార్థులు వెళ్లే సమయాల్లో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నట్లు వాపోతున్నారు. అధికారులు స్పందించి నిషిద్ధ సమయాల్లో భారీ వాహనాల రాకపోకలను నిరోధించాలని కోరుతున్నారు.

మధుర గీతాలాపనతో ఘంటసాలకు నివాళి

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నేపథ్య గాయకుడు ఘంటసాల వేంకటేశ్వరరావు 50వ వర్ధంతి కార్యక్రమాన్ని రైల్వే ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయిధ్యానమందిరం ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గానసుధ గల్లా చిట్టిబాబు బృందంతో ఘంటసాల మధుర భక్తి గీతాలాపన జరిగింది. అనంతరం గాయకులను సత్కరించారు.

బాలయోగి కొండపై కమ్యూనిటీ హాలుకు వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న కొండప్రాంత నివాసితులు

మురళీనగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మాధవధార 50వ వార్డు కొండవాలు నివాసిత ప్రాంతం బాలయోగి కొండ వద్ద కమ్యూనిటీ హాలు నిర్మించాలని కోరుతూ మంగళవారం స్థానికులు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజుకు వినతిపత్రం అందజేశారు. కొండవాలు ప్రాంతాల్లో ప్రధాన సమస్యలుగా ఉన్న కాలువలు, వీధి దీపాలు, వీధి రోడ్లను నవీకరించి బాలయోగి కొండ నివాసితులకు వసతులు కల్పించాలని కోరారు. కాలనీ ప్రతినిధులు రామ్‌నాయుడు, బుజ్జి, భోజీరాజు, వార్డు టీడీపీ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, గ్రామ యువత హాజరయ్యారు.

రహదారి నియమాలు పాటిస్తేనే ప్రాణరక్షణ

మహరాణిపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ న్యాయవాదులు, ఆర్టీఏ అధికారులు, పోలీసులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. విశాఖపట్నం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు సమీపంలోని తెలుగుతల్లి విగ్రహం నుంచి నిర్వహించిన ర్యాలీని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ జగదాంబ జంక్షన్ మీదుగా పోలీసు కమిషనరేట్ కార్యాలయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కమిషనర్ బాగ్చి మాట్లాడుతూ గమ్యానికి సురక్షితంగా చేరుకోవాలంటే రహదారి భద్రత నియమాలను అందరూ కచ్చితంగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, పెద్ద వాహనాల వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని గుర్తుచేశారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదని సూచించారు. న్యాయవాదుల ద్వారా సమాజానికి భద్రత సందేశాన్ని అందించడం కోసం వారి భాగస్వామ్యంతో ర్యాలీ చేపట్టినట్లు డీటీసీ (ఇన్‌చార్జి) బాధ్యతలు చేపట్టిన ఆర్.సి.హెచ్.శ్రీనివాసరావు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వ్యక్తిగత భద్రత పాటించాలని కోరారు. జిల్లా కోర్టు నుంచి పోలీసు కమిషనరేట్ కార్యాలయం వరకు జరిగిన ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్ష, కార్యదర్శులు బి.సత్యనారాయణ, ఎస్.కృష్ణమోహన్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన ర్యాలీలో పాల్గొన్న పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, న్యాయవాదులు, రవాణా, పోలీసు అధికారులు తదితరులు

ఎంఎస్ఎంఈపై రేపు శివాజీపాలెంలో సదస్సు

మర్రిపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు సంబంధించిన రుణగ్రహీతలకు, రుణ దరఖాస్తుదారులకు అవగాహన కల్పించే నిమిత్తం పంజాబ్ నేషనల్ బ్యాంకు ఆధ్వర్యంలో ఈ నెల 13న శివాజీపాలెంలోని సవేర ఫంక్షన్ హాల్లో ఎంఎస్ఎంఈ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పంజాబ్ నేషనల్ బ్యాంకు విశాఖపట్నం సర్కిల్ హెడ్ వి.నీలిమ తెలిపారు. వివరాలకు 99488 56156 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

ఏయూ అంతర్ కళాశాల టార్గెట్‌బాల్ పోటీలు ప్రారంభం

విశాఖపట్నం స్పోర్ట్స్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఏయూ అంతర్ కళాశాలల మహిళల, పురుషుల టార్గెట్ బాల్ టోర్నీ మంగళవారం ప్రారంభమైంది. గోల్డెన్ జూబ్లీ గ్రౌండ్‌లో ఈ పోటీలను వ్యాయామ విద్య క్రీడా సంచాలకుడు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ ప్రారంభించారు. క్రమశిక్షణ, ప్రతిభతో విజేతలుగా నిలవాలని సూచించారు. మహిళల విభాగంలో ఏవీఎన్ కాలేజి చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. పురుషుల విభాగంలో ఏవీఎన్ కాలేజి, ఏయూ ఆర్ట్స్ కాలేజి బుధవారం జరిగే ఫైనల్స్‌కు చేరాయి. ఫిజికల్ డైరక్టర్లు డాక్టర్ సంధ్యారాణి, ఎస్.గోపీకృష్ణ, టార్గెట్‌బాల్ సంఘం ప్రతినిధి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శనానికి తెరిచిన ఘాట్ రోడ్డు


భక్తులు నేరుగా క్యూలైన్లలోకి ప్రవేశించే ఘాట్ రోడ్డు

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం ఇసుక కొండ సత్యనారాయణ స్వామి దర్శనానికి వచ్చే భక్తుల కోసం పూర్ణామార్కెట్ మెయిన్‌రోడ్డు ఘాట్ రోడ్డు తెరిచినట్లు ఈవో రాజగోపాలరెడ్డి వెల్లడించారు. వాహనాల్లో వచ్చేవారు ఘాట్ రోడ్డు మార్గం గుండా ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొండపైకి చేరుకోవచ్చునన్నారు. కేజీహెచ్ ప్రధాన ద్వారం, ఏవీఎన్ కాలేజీ వెనుక ఆంధ్రా మెడికల్ కాలేజీ మార్గం పూర్తిగా నిషిద్ధమన్నారు. భక్తులు ఘాట్ రోడ్డు మార్గం గుండా కొండపైకి క్యూలైన్లలోకి చేరుకోవచ్చునన్నారు. భక్తులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పదో తరగతి పరీక్షల నిర్వహణకు సన్నద్ధంకండి

మహరాణిపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మార్చి 17 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా ఇన్‌చార్జి డీఆర్వో సీతారామారావు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 134 కేంద్రాల్లో 15,094 మంది బాలురు, 13,429 మంది బాలికలు పరీక్షలకు హాజరవుతారన్నారు. ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, అన్ని రకాల సాంకేతిక ప్రక్రియలు పూర్తి చేసి పరీక్షల నిర్వహణకు సన్నద్ధంగా ఉండాలన్నారు. పరీక్షలు సజావుగా ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పోలీసు, రెవెన్యూ, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖ, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

కంచరపాలెంలో నేటి నుంచి ఫార్మాసిస్టులకు నైపుణ్య శిక్షణ

కంచరపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో బుధవారం ఫార్మాసిస్టులకు ఉచితంగా నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు తెలిపారు. భారత ప్రభుత్వ లైఫ్ సైన్సెస్ సెక్టార్ వారి స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నాలుగు రోజులు తరగతులు నిర్వహిస్తారు. శిక్షణలో ఫార్మా కోవిజన్స్ కేస్ ప్రాసెసింగ్ అనే అంశంపై కూలంకషంగా చర్చిస్తారు. తరగతులకు హాజరయ్యేందుకు జిల్లా వ్యాప్తంగా 40 మంది ఫార్మాసిస్టులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు.

'పోర్టు ఆసుపత్రిని ప్రైవేటువారికి ఇవ్వొద్దు'



పోర్టు ఆసుపత్రి ఎదుట కొనసాగుతున్న నిరసన దీక్షలో నినదిస్తున్న ఉద్యోగులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పోర్టు ఆసుపత్రిని ప్రైవేటు వారికివ్వకుండా సొంత నిధులతోనే అభివృద్ధి చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.జగన్ అన్నారు. పోర్టు ఆసుపత్రి ఎదుట కొనసాగిస్తున్న నిరసన దీక్ష మంగళవారం 134వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రి 150 పడకల సామర్థ్యంతో నిర్మించి ప్రస్తుతం 80 పడకలతో సమర్థంగా పోర్టు, డాక్ అధికారులకు, ఉద్యోగులకు, కార్మికులకు, రిటైర్డ్ ఉద్యోగులకు, కార్మికులకు దశాబ్దాల తరబడి 40 వేల కుటుంబాలకు సేవలందిస్తుందని గుర్తు చేశారు. అటువంటి పోర్టు ఆసుపత్రిని పీపీపీ పద్ధతిలో మల్టీ డిసిప్లినరీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా 300 పడకలతో ప్రైవేటు వారికి అప్పగించాలనే నిర్ణయం చాలా దుర్మార్గమన్నారు. ప్రైవేటు వారికిస్తే ఆరోగ్య భద్రతను వారి చేతుల్లో పెట్టడమే అవుతుందని పునరుద్ఘాటించారు. ఈ దీక్షలో నాయకులు జె.సత్యనారాయణ, కె.సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, మూర్తి, సీహెచ్‌వీఎస్ రెడ్డి, నరసింహ, రాఘవులు, నాయుడు పాల్గొన్నారు.


స్థానిక మహాత్మాగాంధీ జీవీఎంసీ పాఠశాల విద్యార్థులకు నాంది ఫౌండేషన్ మంగళవారం క్రీడా కిట్లు అందజేసింది. కిట్లు అందుకున్న విద్యార్థులతో ఫౌండేషన్ ప్రతినిధులు చాప జయలక్ష్మి, వరలక్ష్మి, హెచ్.ఎం.నాగభూషణం, ఉపాధ్యాయులు - ఆంధ్రజ్యోతి, అల్లిపురం

18 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ మండల పరిధి పిట్టవానిపాలెం శివారు ప్రాంతంలో 18 మద్యం సీసాలతో వెంపాడ ఆనందకుమార్‌ను దువ్వాడ పోలీసులు అరెస్టు చేసి, మద్యం స్వాధీనం చేసుకున్నారు. పిట్టవానిపాలెం గ్రామ దేవత పండగ సందర్భంగా దువ్వాడ ఎస్ఐ శ్రీనివాసరావు గ్రామంలో గస్తీ నిర్వహిస్తున్నారు. అక్రమ మద్యం ఎక్కువ పరిమాణంలో ఓ వ్యక్తి వద్ద ఉందన్న సమాచారంతో సిబ్బందితో వెళ్లి ఆనంద్‌కుమార్‌ను అరెస్టు చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ వార్షికోత్సవానికి నగర సీపీకి ఆహ్వానం


సీపీకి ఆహ్వాన పత్రిక అందిస్తున్న భరణికాన రాజు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సత్యసాయినగర్‌లో జరగనున్న విజయదుర్గ అమ్మవారి ఆలయ వార్షికోత్సవానికి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీని 45వ వార్డు టీడీపీ అధ్యక్షుడు భరణికాన రాజు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. సీపీకి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆయనను కలిసినవారిలో పీలా హరిప్రసాద్, సత్యసాయి సాంస్కృతిక సేవాసంఘం, గ్రామకమిటీ సభ్యులు ఉన్నారు.

ఆగమేఘాలపై పనులు..అయోమయంలో ప్రజలు!

కంచరపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు రెడ్డి కంచరపాలెం సన్ రైజ్ క్లబ్ దుర్గాదేవి ఆలయం వద్ద ప్రధాన స్తంభంపై ఉన్న విద్యుత్ తీగలను కంచరపాలెం విద్యుత్ కార్యాలయం సిబ్బంది ఆగమేఘాలపై మార్చి పక్కకు జరపడంపై స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడ స్తంభాన్ని ఆనుకుని ఉన్న పాత భవనాన్ని తొలగించి నూతన భవన నిర్మాణం చేపట్టడానికి సంబంధిత వ్యక్తులు పనులు ప్రారంభించారు. భవన నిర్మాణానికి విద్యుత్ స్తంభం, తీగలు ఆటంకంగా మారాయి. దీంతో ఏమి జరిగిందో తెలియదు గాని విద్యుత్ సిబ్బంది మాత్రం ఒక్కరోజులో వైర్లు పక్కకు జరిపి కొత్తవి ఏర్పాటు చేశారు. ఏళ్ల తరబడి లోఓల్టేజి, పాడైపోయిన వైర్లు, విద్యుత్ కోతలతో సతమతమవుతున్న పరిసర వీధుల ప్రజలు విద్యుత్ సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలం వస్తే అధిక భారంతో తీగలు తెగి తరచూ విద్యుత్ సరఫరా ఆగిపోయినా పట్టించుకోని సిబ్బంది ఇలా కొత్త భవనాలు, నిర్మాణాలకు ఆటంకంగా ఉన్న వైర్లు, స్తంభాలను తొలగించడంలో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తమకు కాసులు కురిపించే పనులపై త్వరితగతిన స్పందించే అధికారులు, విద్యుత్ సిబ్బంది ప్రజా సమస్యలపై అదేరీతిలో చర్యలు తీసుకుంటే బాగుండేదని నిష్ఠూరమాడుతున్నారు. పలుకుబడి వర్గాలకు వత్తాసు పలకడం మానేసి ప్రజల సౌకర్యం గురించి పని చేయాలని చురకలంటించారు.


సన్‌రైజ్ క్లబ్ వద్ద విద్యుత్ వైర్లు మార్చుతున్న సిబ్బంది

స్మార్ట్ స్ట్రీట్స్ అధ్వానం

... 5వ పేజీ తరువాయి

వ్యక్తమయ్యాయి. దీంతో కేవలం ఏడు కిలో మీటర్ల మేర ఐదు రోడ్లను మాత్రమే రూ.60 కోట్లతో స్మార్ట్‌స్ట్రీట్‌లుగా అభివృద్ధి చేయాలని జీవీఎస్‌సీసీఎల్ నిర్ణయించింది. ఈ మేరకు పెదవాల్తేరు జంక్షన్ నుంచి చినవాల్తేరు మార్గంలో ప్రభుత్వ మానసికవైద్యశాల జంక్షన్ వరకు ఉన్నరోడ్డు, పార్క్‌హోటల్ జంక్షన్ నుంచి పెదవాల్తేరు జంక్షన్ రోడ్డు, సిరిపురం జంక్షన్ నుంచి ఆల్‌ఇండియా రేడియో కేంద్రానికి ఇరువైపులా ఉన్న రెండు రోడ్లు, సిరిపురం జంక్షన్ నుంచి పాండురంగాపురం డౌన్ రోడ్డును స్మార్ట్‌స్ట్రీట్‌లుగా ఎంపిక చేశారు.

అధ్వానంగా మారిన వైనం

జీవీఎంసీ రూ.60 కోట్లు వెచ్చించి అభివృద్ధి చేసిన ఈ ఐదు రోడ్లలో ఒకటైన పెదవాల్తేరు జంక్షన్ నుంచి ప్రభుత్వ మానసిక వైద్యశాల జంక్షన్ రోడ్డు ప్రస్తుతం అధ్వానంగా మారింది. రోడ్డు పొడవునా అందమైన టైల్స్‌తో నిర్మించిన ఫుట్‌పాత్‌లు, సైక్లింగ్‌ట్రాక్‌లు, పార్కింగ్ స్థలాలను ఆక్రమించి దుకాణాలు, మెకానిక్ షెడ్లు, స్క్రాప్ గోడౌన్లను ఏర్పాటు చేశారు. స్మార్ట్‌స్ట్రీట్ ప్రాజెక్టు డిజైన్‌లో పేర్కొన్నట్టుగా ప్రజా వినియోగంలో ఉండేలా చూడాల్సిన జీవీఎంసీ, పోలీస్ అధికారులు ఆ బాధ్యతను విస్మరించడంతో ఆక్రమణదారులకు అడ్డులేకుండాపోయింది. వాకింగ్‌ట్రాక్, ఫుట్‌పాత్‌లను తవ్వేయడంతో రూ.కోట్లు వెచ్చించి వేసిన టైల్స్ పైకి లేచిపోయాయి. వాకింగ్‌ట్రాక్‌లు, ఫుట్‌పాత్‌లపై నడిచేందుకు చోటులేకపోవడంతో పాదచారులంతా రోడ్డుపైనే నడవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆ రోడ్డులో ఉన్న బస్టాప్‌లను కూడా ఆక్రమించి, దుకాణాలను ఏర్పాటు చేసుకోవడం పరిస్థితికి అద్దంపడుతోంది. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్మార్ట్‌స్ట్రీట్‌గా అభివృద్ధి చేసిన రోడ్డులో ఆక్రమణలను తొలగించి లక్ష్యానికి అనుగుణంగా తీర్చిదిద్దాల్సి ఉంది.

సిటీలో ఫ్లూ ఫీవర్స్

... 5వ పేజీ తరువాయి

నెబిలైజేషన్ పెట్టాల్సి వస్తోందని తెలిపారు.

రోగుల సంఖ్య ఎక్కువే...

గొంతు నొప్పి, జలుబు, దగ్గుతో కేజీహెచ్, విమ్స్‌లకు ప్రతిరోజూ 40 మంది వరకూ వస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు వస్తున్నవారిలో దాదాపు 50 శాతం మందికి ఈ లక్షణాలున్నాయని వైద్యులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో ఎండతీవ్రత పెరిగే కొద్దీ కొన్ని వైరస్‌లు మరింత యాక్టివ్ అవుతాయని, దీనివల్ల కేసులు పెరుగుతాయని వైద్యులు చెబుతున్నారు.

తీవ్రతను బట్టి మందులిస్తున్నాం



ఫ్లూ కేసులు పెరిగాయి. తీవ్రతను బట్టి మందులు ఇస్తున్నాం. కొందరికి యాంటీ బయాటిక్స్ ఇవ్వాల్సి వస్తోంది. సీజన్ మారుతున్న సమయంలో ఫ్లూ వైరస్‌లు వ్యాప్తి చెందుతుంటాయి. ప్రస్తుత వైరస్ తీవ్రత కొంత బలంగా ఉన్నట్టు కనిపిస్తోంది. అందువల్ల రోజుల తరబడి లక్షణాలుంటున్నాయి. మూడు రోజులకు మించి దగ్గు, ఇతర లక్షణాలుంటే వైద్యులను సంప్రతించాలి.

- డాక్టర్ వై.జ్ఞానసుందరరాజు, జనరల్ మెడిసిన్ వైద్యులు

పూర్ణా మార్కెట్‌లో బినామీల దందా!

... 5వ పేజీ తరువాయి

మార్కెట్‌లో ఓ వ్యక్తి ఏదో ఒక అసోషియేషన్ పేరుతో హడావుడి చేస్తూ డీ సెక్షన్‌లోని ఆరు దుకాణాలు, సీ సెక్షన్‌లో ఒక దుకాణం, గ్యాంగ్‌వేజ్‌లో ఐదు దుకాణాలు, తావేజిలు కట్టే వరుసలో ఒక దుకాణాన్ని తన గుప్పిట్లో ఉంచుకున్నారు. మార్కెట్‌లో వ్యాపారం చేసే మరో వ్యక్తికి గ్యాంగ్‌వేజ్‌లో ఆరు దుకాణాలు, బి సెక్షన్‌లో రెండు, చేపలమార్కెట్‌లో ఒక దుకాణం ఉన్నాయి. మరో దళారీ పీ సెక్షన్‌లో మూడు, గ్యాంగ్‌వేజ్‌లో మూడు దుకాణాలు తన చేతిలో ఉంచుకున్నారు. కిరాణా దుకాణం నడిపే ఓ వ్యక్తి బి సెక్షన్‌లో మూడు దుకాణాలను కలిగి ఉన్నారు. ఇలా మరికొందరు రెండు కంటే ఎక్కువ దుకాణాలను చేజిక్కించుకుని వాటిని ఇతర వ్యాపారులకు అద్దెలకిచ్చి జేబులు నింపుకుంటున్నారు. ఈ విషయాలన్నీ అక్కడే ఉండి ప్రత్యక్షంగా పరిశీలించే వార్డు శానిటేషన్ ఉద్యోగికి తెలిసినా అభ్యంతరం చెప్పకపోవడం విశేషం.

బినామీల సమాచారం సేకరించాం

మార్కెట్‌లో కొంతమంది పదుల సంఖ్యలో దుకాణాలను తమ గుప్పిట్లో పెట్టుకున్నారనే సమాచారం ఉంది. దీనిపై ఆధారాలు సేకరిస్తున్నాం. దుకాణాలను రోజువారీ అద్దెకు ఇచ్చి జేబులు నింపుకుంటున్న దళారుల నుంచి స్వాధీనం చేసుకోవడానికి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. త్వరలోనే ఒకరికి ఒక దుకాణం మాత్రమే ఉండేలా ప్రక్షాళన చేస్తాం.

- ఎం.మల్లయ్యనాయుడు, జోన్-4 కమిషనర్

నగరానికి 100 ఇ-బస్సులు

... 5వ పేజీ తరువాయి

డిపోల్లో 804 బస్సులు సేవలందిస్తుండగా, వాటిలో 35 కాలం చెల్లిన బస్సులున్నాయి. 13 లక్షల కిలోమీటర్లు తిరగడం, 15 సంవత్సరాల పాటు రవాణా సేవలు అందించిన బస్సులను కాలం చెల్లినవిగా గుర్తిస్తారు. అవి ప్రయాణికుల రవాణా సేవలకు వినియోగించరాదన్న నిబంధన ఉంది. ఇలాంటి బస్సులు వివిధ డిపోలు, గ్యారేజీల్లో ఉన్నాయి. అత్యవసర సమయాల్లో మాత్రమే వీటిని వినియోగిస్తున్నారు. ఎలక్ట్రికల్ బస్సులు అందుబాటులోకి వచ్చిన వెంటనే ఈ బస్సులను రవాణా సేవలనుంచి తొలగించి విజయనగరం సెంట్రల్ గ్యారేజీకి పంపుతామని రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. తిరుపతి- తిరుమల మధ్య ప్రవేశపెట్టిన ఎలక్ట్రికల్ బస్సులతో రవాణా సౌకర్యం మెరుగ్గా ఉండడంతో విశాఖలో వీటిని నడపాలని ప్రభుత్వం నిర్ణయించింది.

అయ్యో...జింకలు!

... 5వ పేజీ తరువాయి

సంచరించని చోట్లకు వెళ్లినా ప్రమాదం ఉండదు. కానీ అటు ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల, ఇటు కంబాలకొండ మధ్యనుంచి వెళుతున్న జాతీయ రహదారి, మధురవాడ, పీఎంపాలెం, కొమ్మాది, ఆదర్శనగర్‌వైపు వచ్చే జింకలు ప్రమాదంలో చిక్కుకుంటున్నాయి. జాతీయ రహదారిని దాటి ఎండాడ, విశాఖ వ్యాలీ స్కూలు రోడ్డులో వెళ్లినపుడు వాహనాలు ఢీకొని ప్రాణాలు కోల్పోతున్నాయి. కంబాలకొండ అభయారణ్యానికి ఫెన్సింగ్‌లేని ప్రాంతాల నుంచి జింకలు జాతీయ రహదారిపైకి వస్తున్నాయి. ఆ సమయంలో వాహనాలపై వెళ్లేవారు కొందరు వాటిని చూసి, తిరిగి కంబాలకొండవైపు పంపుతుంటారు. భారీ వాహనాలు వేగంగా వెళ్లేటప్పుడు రోడ్డు దాటే క్రమంలో జింకలు ప్రమాదానికి గురవుతుంటాయి.

రక్షణ చర్యలు చేపట్టాలి

ప్రస్తుతం కంబాలకొండలో జింకల రక్షణపై అటవీశాఖ అప్రమత్తంకావాలని ప్రజలు కోరుతున్నారు. కంబాలకొండ చుట్టూ ఫెన్సింగ్ వేయడం, కొన్నిచోట్ల రక్షణ గోడలు నిర్మించాలని సూచిస్తున్నారు. అయితే కంబాలకొండలో భారీగా ఉన్న జింకల్లో కొన్నింటిని ఇతర అభయారణ్యాలకు తరలించాలని అధికారులు యోచిస్తున్నట్టు సమాచారం. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారని తెలిసింది. అయితే దీనికి కేంద్ర ప్రభుత్వం అనుమతి తప్పనిసరి. అప్పటివరకు కంబాలకొండ అభయారణ్యంలో జింకలకు రక్షణ కల్పించడంతోపాటు వేసవిలో తాగునీరు, ఆహారం కోసం గడ్డిని పెంచాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.



నాలుగేళ్ల కిందట రామకృష్ణానగర్‌లో కూలిన కొండచరియ (ఫైల్ ఫొటో)

రిటెయినింగ్ వాల్ నిర్మించరూ..

గోపాలపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కొండచరియ జారిపడి నాలుగేళ్ల గడుస్తున్నా ఇప్పటికీ రిటెయినింగ్ వాల్ నిర్మాణం చేపట్టకపోవడంతో ఎగువ ప్రాంతంలో ఉంటున్న ప్రజలు భీతిల్లుతున్నారు. 91వ వార్డు రామకృష్ణానగర్‌లో నాలుగేళ్ల క్రితం భారీ కొండచరియ జారిపడింది. దీంతో అధికారులు, నేతలు ఈ ప్రాంతంలో పర్యటించి రిటెయినింగ్ వాల్ నిర్మిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. అయితే ఇప్పటికి నాలుగేళ్లు గడిచినా ఈ ప్రాంతం వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇటీవల గోపాలపట్నం ప్రధాన రహదారికి ఆనుకుని భారీ కొండచరియ జారిపడితే మాత్రం యుద్ధప్రాతిపదికన రిటెయినింగ్ వాల్ నిర్మాణం చేపడుతున్నారన్నారు. అక్కడకు సమీపంలోనే నాలుగేళ్ల క్రితం కొండచరియ జారిపడినా ఎందువల్ల రిటెయినింగ్ వాల్ నిర్మించడం లేదో అర్థం కావడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రిటెయినింగ్ వాల్ నిర్మాణంపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

చురుగ్గా కాలువ నిర్మాణం



కాలువ పనులను పరిశీలిస్తున్న అధికారులు

వేపగుంట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 94వ వార్డు పరిధి నాయుడుతోట వెంకటసాయినగర్‌లో శ్రీకల్యాణ వెంకన్న ఆలయ పరిసర కొండవాలు ప్రాంతంలో కాలువ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. కొండపై నుంచి వచ్చే వర్షపు నీరు కారణంగా ఇక్కడి రహదారులు పాడైపోతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని సుమారు రూ.37 లక్షలతో కాలువ నిర్మాణం, కల్వర్టు, రహదారి నిర్మాణ పనులను చేపట్టారు. ఆయా పనులను మంగళవారం జోన్-8 ఈఈ చిరంజీవి, డీఈ ప్రవీణ్‌కుమార్‌లు పరిశీలించారు. పనుల తీరును కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు.

సినిమా గైడ్

- **తండేల్ :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ),
- **భవానీ వార్డ్ :** జగదాంబ, రమాదేవి
- **మదగజరాజ :** జగదాంబ, వెంకటేశ్వర-1, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),
- **సంక్రాంతికి వస్తున్నాం :** శారద, మెలోడి, జగదాంబ, కిన్నెర, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 10, వంకాయలు (తెలుపు) 16, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 36, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 12, క్యాబేజీ 12, క్యారెట్ 24 దొండకాయలు 30, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)40, బరబాటి 34, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 62, బద్దచిక్కుడు 26, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 130, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 40, కీర దోస 26, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 32 చిలగడదుంపలు 38, కంద 68, దేముడు చిక్కుడు 28, గోరు చిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 25, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469


చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	96
లైవ్ ధర	116
విత్ స్కిన్	202
స్కిన్‌లెస్	212

స్టీల్‌ప్లాంటులో పదవీ విరమణ చేశాక తమ బతుకులు రోడ్డున పడుతున్నాయని పలువురి ఆవేదన

ఉద్యోగుల మాదిరిగా తమకూ ఎంతో కొంత ఆర్థిక చేయూతనివ్వాలని వేడుకోలు

ఆర్థిక భరోసా లేక కాంట్రాక్టు కార్మికులు విలవిల

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారంలో శాశ్వత ఉద్యోగుల మాదిరిగానే కాంట్రాక్టు కార్మికులు 60 ఏళ్లకు పదవీ విరమణ చేస్తారు. అయితే ఉద్యోగులకు పదవీ విరమణ చేసినప్పుడు యాజమాన్యం వారికి ఆర్థిక ప్రయోజనాలను కల్పిస్తుంది. అయితే కాంట్రాక్టు కార్మికులకు ఎటువంటి ఆర్థిక ప్రయోజనాలు లేకపోవడంతో వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టీల్‌ప్లాంటులో సుమారు 13 వేల మంది కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరు కాంట్రాక్టర్ల పరిధిలో పనిచేస్తుంటారు. వీరికి సంబంధించి ఈఎస్‌ఐ, పీఎఫ్ వంటివి యాజమాన్యం ఆధ్వర్యంలో కాంట్రాక్టర్లు చెల్లిస్తుంటారు. వీరి పదవీ విరమణ వయసు 60 ఏళ్లగా యాజమాన్యం నిర్ణయించింది. అరవై ఏళ్లు కాగానే కాంట్రాక్టు కార్మికులంతా తమ గేటు గేటు పాసును సంబంధిత కాంట్రాక్టరుకు అప్పగించి విధుల నుంచి వైదొలగతారు. అయితే పదవీ విరమణ చేసిన రోజు వీరికి ఎటువంటి ఆర్థిక ప్రయోజనం కల్పించరు.



పదవీ విరమణ చేసి బయటకు వస్తే తమ బతుకులు రోడ్డున పడినట్టేనని పలువురు కార్మికులు వాపోతున్నారు. ఉక్కు ఉద్యోగుల మాదిరిగానే తమకు ఎ ఎంతో కొంత ఆర్థిక ప్రయోజనం కల్పిస్తే తమ బతుకులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని వారు కోరుతున్నారు. ఇదిలావుండగా ఆధార్ కార్డులో ఉన్న వయసు ఆధారంగానే ఉక్కు యాజమాన్యం పదవీ విరమణ తేదీలను ధ్రువీకరిస్తుందని, అయితే చాలామంది కార్మికుల ఆధార్ కార్డులో తప్పులు చోటుచేసుకున్నాయి, అందువల్ల విద్యా ధ్రువీకరణ పత్రాల ఆధారంగా వయసును ధ్రువీకరించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తే మంచిది

-కేఎస్ఎన్ రావు, గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు



స్టీల్‌ప్లాంటులో 13 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారు. వీరంతా 60 ఏళ్ల వయసు రాగానే పదవీ విరమణ చేసి బయటకు వచ్చేసరికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. వీరికి ఆర్థిక ప్రయోజనాలు కల్పించే దిశగా ఉక్కు యాజమాన్యం యోచించాలి. సంస్థలో 30 ఏళ్లపాటు విధులు నిర్వహించి ఒక్కసారిగా ఎలాంటి ఆర్థిక ప్రయోజనం లేకుండా బయటకు రావడం కష్టతరంగా మారింది.

భెల్ కార్మికుల పీఎఫ్ సమస్యను పరిష్కరించాలి

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): భెల్ హెచ్‌పీవీపీ కార్మికుల సర్వీసు రికార్డుల్లో పీఎఫ్ నమోదులో జరిగిన తప్పులను సవరించి వారిని ఆదుకోవాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు సంస్థ కార్మికులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం గుర్తింపు యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో పలువురు కార్మికులు పల్లాను కలిసి తమ సమస్యలను వివరించారు. 1992లో చేరిన ఆర్-సిరీస్ కార్మికుల వేతనాల నుంచి పీఎఫ్ కోత విధిస్తున్నప్పటికీ



పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న భెల్ హెచ్‌పీవీపీ గుర్తింపు యూనియన్ నాయకులు

కొంతమందికి సర్వీస్ రికార్డులో మాత్రం 1997 నుంచి కట్ అవుతున్నట్టు, మరికొంతమందికి 2011 నుంచి నమోదవుతున్నట్టు ఉందన్నారు. ఈ తప్పుడు నమోదు వల్ల కార్మికులు పదవీ విరమణ సమయంలో ఆర్థికంగా నష్టపోవడంతో పాటు పింఛన్ తక్కువగా వస్తుందని, అందువల్ల ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యపై భెల్ యాజమాన్యంతో, పీఎఫ్ కమిషనర్‌తో చర్చిస్తానని పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చినట్టు కార్మిక నాయకులు తెలిపారు. పల్లాను కలిసిన వారిలో నాయకులు పీవీఎస్ రాజు, బి.రవీంద్రబాబు, టి.భాస్కర్, ఆర్ఆర్ నాయుడు, తదితరులు ఉన్నారు.

బుచ్చిరాజుపాలెంలో వైభవంగా పైడిమాంబ పరస



పైడిమాంబ పూజల్లో పాల్గొన్న గణబాబు దంపతులు

ఎన్.ఎ.డీ జంక్షన్ ఫిబ్రవరి 11: బుచ్చిరాజుపాలెం పరిసర 16 గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత శ్రీపైడిమాంబ అమ్మవారి పరసను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువజాము మూడు గంటల నుంచి సుప్రభాత సేవ, గణపతి పూజ, మండప ఆవాహన, అమ్మవారికి మంగళ కలశ స్నానం, హారతి, ఐదు గంటలకు క్షీరాభిషేకం చేసి హారతి ఇచ్చాక భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పైడిమాంబను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అమ్మవారిని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. అలాగే జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, బెహరా భాస్కరరావు, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం పరసలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. భక్తులు ఇబ్బందులు పడకుండా పటిష్ఠ చర్యలు చేపట్టామని ఉత్సవ అధికారి టి.రాజగోపాలరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త పురెడ్డి ప్రకాశ్‌రెడ్డి, ఆలయ ఈవో పీఎస్ఆర్ మూర్తి, ఉత్సవ కమిటీ సభ్యులు మాజీ కార్పొరేటర్ మళ్ల అప్పారావు, రవీందర్‌రెడ్డి, వై.ప్రసాద్, బి.అప్పలరెడ్డి, శంకర్, చంటి, జగన్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భూలోకమాత పండగ

పెందుర్తి-రూరల్: మండలంలోని చింతలఅగ్రహారం, గవరపాలెం, దుర్గానగర్ గ్రామాల ప్రజల ఇష్ట దైవం భూలోకమాత పండగను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు, సర్పంచ్ దాడి గోపీ వెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ కాళ్ల వరలక్ష్మి, మాజీ సర్పంచ్ ఆళ్ల తాతారావు, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం పరసలో ఏర్పాటు చేసిన బుర్రకథ, నాటకం, తదితర సాంస్కృతిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

కొనసాగుతున్న శివశివానీ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

పెందుర్తి: మండలంలోని సరిపల్లిలో గల స్వయంభు మల్లీశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శివశివానీ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో మంగళవారం నవగ్రహ మండప ఆవాహన, జపాలు, ఆదిత్య ప్రణామం, ధాన్యాదివాసాన్ని రుత్వికులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం హోమాలు, చండీ, నవగ్రహ, రుద్ర, లక్ష్మీనారాయణ పంచశయ్య ఆదివాసాలు, తదితర పూజాది కార్యక్రమాలు జరిపాక పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ముత్యాల పల్లకీలో అధిష్ఠింపజేసి పురవీధుల్లో ఊరేగించారు.

నేడు శివశివానీ విగ్రహ ప్రతిష్ఠ

స్వయంభు మల్లీశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం ముక్కు తిరుపతయ్య కటుంబీకులు భూదానం చేసిన స్థలంలో శివశివానీ సమేత శంకరాచార్య విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపడతామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.



సరిపల్లిలో పూజల్లో పాల్గొన్న భక్తులు

మొరాయించిన ఆర్టీసీ బస్సు: తీవ్ర ఇబ్బందులకు గురైన ప్రయాణికులు

సింధియా, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు రాకపోకలు సాగించే 400వై-నంబర్ బస్సు మంగళవారం మధ్యాహ్నం మార్గ మధ్యంలో మొరాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎలమంచిలి నుంచి నగరానికి వస్తున్న బస్సు మధ్యాహ్నం రెండు గంటల తర్వాత మల్కాపురం ఐవోసీ వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా ఆగిపోయింది. ఆ తర్వాత ఎంత బస్సు స్టార్ట్ కాకపోవడంతో డ్రైవర్, కండక్టర్లు ప్రయాణికులను కిందకు దించేశారు. వేరే బస్సులో పంపిస్తామని వారు నచ్చజెప్పారు. అయినప్పటికీ మండుటెండలో తమను కిందకు దింపేయడం పట్ల పలువురు ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురయ్యారు. అయితే ఎంతసేపటికీ వేరే బస్సు రాకపోవడంతో పలువురు వృద్ధులు ఎండకు



మొరాయించిన ఆర్టీసీ నంబర్ 400-వై బస్సు... ఎండలో వేరే బస్సు కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

విలవిల్లాడిపోయారు. దీంతో చేసేది లేక కొంతమంది ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి తమ గమ్య స్థానాలకు వెళ్లిపోయారు. మిగిలిన ప్రయాణికులు వేరే బస్సు వచ్చేంత వరకు నిరీక్షించారు. ప్రభుత్వాలు మారుతున్నా తమకు తుక్కు బస్సుల బాధ తప్పడం లేదని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆమోదయోగ్యమైన ఉత్పత్తుల్లో బీపీసీఎల్ ముందంజ

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వాహన వినియోగదారులకు అన్ని విధాలా ఆమోదయోగ్యమైన ఉత్పత్తులను అందించడంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్



కార్యక్రమంలో పాల్గొన్న వెంకన్నచౌదరి, తదితరులు

ముందుంటుందని అనురాధ పెట్రో సర్వీస్ చైర్మన్ యార్లగడ్డ వెంకన్న చౌదరి అన్నారు. బీపీసీఎల్ 50వ వార్షికోత్సవంతో పాటు షీలానగర్‌లోని అనురాధ పెట్రో సర్వీస్ సెంటర్ 35 వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం బంక్‌లో 4టీ ఇంజన్ ఆయిల్ కొనుగోలుపై ప్రత్యేక ఆఫర్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా షీలానగర్ బంక్‌లో 66,100 లీటర్ల ఇంజన్ ఆయిల్ అమ్మకాలు చేపట్టి సరికొత్త రికార్డు సాధించినట్టు వెంకన్న చౌదరి తెలిపారు. కార్యక్రమంలో బీపీసీఎల్ అధికారులు దినేశ్, శ్రీకాంత్, అభిషేక్, మన్విత, రవి, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

'నాంది' ఆధ్వర్యంలో విద్యార్థినులకు స్పోర్ట్స్ కిట్‌ల పంపిణీ

పెందుర్తి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పాత పెందుర్తిలో గల జెడ్పీ పాఠశాల విద్యార్థినులకు నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ కిట్‌లను పంపిణీ చేశారు. మంగళవారం పాఠశాల ప్రాంగణంలో హెచ్ఎం ఎం.కిరణ్మయి అధ్యక్షతన



స్పోర్ట్స్ కిట్‌లతో విద్యార్థినులు

జరిగిన కార్యక్రమంలో నాంది ఫౌండేషన్ ప్రతినిధి స్వప్నారెడ్డి 6,7,8,9 తరగతుల విద్యార్థినులకు టీషర్టులు, నోటు పుస్తకాలు, శానిటరీ నాప్‌కిన్స్, బూట్లు, సాక్సులు, ఫుట్‌బాల్, త్రోబాల్ తదితర క్రీడా సామగ్రితో కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు జగదీశ్, ఎస్ఎంసీ చైర్మన్ ఆర్.గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

52వ వార్డులో డిప్యూటీ మేయర్ పర్యటన

ఎన్.ఎ.డి.జంక్షన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 52వ వార్డు పరిధి ఎన్ఏడీ, శాంతినగర్, వుడా కాలనీ, తదితర ప్రాంతాల్లో మంగళవారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల కారణంగా ఇబ్బందులను గతంలో సీఎండీకి తెలియజేయడంతో చేపట్టిన కేబుల్స్ పనిని, ఎన్ఏడీ తాసిన్ మసీద్‌ను ఆయన పరిశీలించారు. ఆయా పనులకు సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కమనీయం అప్పన్న కల్యాణం



కల్యాణ అక్షతలను చూపుతున్న అర్చకులు

సింహాచలం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్యకల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలను యథావిధిగా పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కమనీయంగా స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

బొర్రమాంబ ఆలయంలో పూజలు

అగనంపూడి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత బొర్రమాంబ ఆలయంలో మాఘ మంగళవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని పుష్పాలు, నూతన వస్త్రాలతో అలంకరించగా, అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు లలిత, విష్ణుసహస్రనామ పారాయణాలను పఠించారు.



కేక్ కట్ చేస్తున్న పంచకర్ల రమేశ్‌బాబు, సేనాపతి వసంత

మహిళా సంఘాలతో ఆర్థికంగా బలోపేతం

ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు మహిళా సంఘాలు ఎంతగానో దోహదపడతాయని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. 97వ వార్డు పరిధి సుజాతనగర్ కాలనీ మహిళా సంఘ 30వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యేతో పాటు కార్పొరేటర్ సేనాపతి వసంత హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం పంచకర్ల మాట్లాడుతూ మహిళా సాధికారతకు సుజాతనగర్ మహిళా సంఘం చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. సంఘం చేపట్టిన సామాజిక సేవ, రక్తదానం, పార్కుల అభివృద్ధి గురించి ప్రతినిధులు వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సేనాపతి శంకరరావు, ఎస్.సోమశేఖర్, సంఘం ప్రతినిధులు గేహర్‌కమిల్, పుష్ప, హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

దీన్ దయాళ్ ఉపాధ్యాయ జీవితం ఆదర్శనీయం



దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కరణంరెడ్డి

గాజువాక , ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సిద్ధాంకర్త పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జీవితాన్ని నేటి నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని పార్టీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. పాత కర్ణవానిపాలెంలో మంగళవారం జరిగిన దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, బొండా ఎల్లాజీ, రోహిణి, కె.పద్మ, బి.దిలీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: ములగాడ మండలం హిమాచల్‌నగర్‌లో డాక్టర్ పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని బీజేపీ సీనియర్ నాయకుడు కవులూరి గురుమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిమేర శ్రీనివాస్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు లక్కరాజు రామకృష్ణ, జి.సతీశ్, ఎం.రవి, టి.సతీశ్, ఎం.హేమారావు, శివ, కె.సత్యనారాయణ, వాసు, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటు మరణాలను నివారిద్దాం

అగనంపూడి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గుండెపోటు మరణాలను నివారించడానికి ప్రభుత్వం స్టెమి గుండెకు భరోసా అనే కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అమలు చేస్తోందని, దీనిని ప్రతిఒక్కరూ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రత్యూష

సద్వినియోగం చేసుకోవాలని అగనంపూడి ఏరియా ఆస్పత్రి జనరల్ మెడిసన్ స్పెషలిస్ట్ డాక్టర్ ప్రత్యూష కోరారు. గుండెకు భరోసా కార్యక్రమంపై మంగళవారం ఆస్పత్రిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గుండెపోటుకు ముందు వచ్చే లక్షణాలను వివరించారు. ఆయాసం రావడం, గుండె దడగా ఉండడం, స్పృహ కోల్పోవడం, ఎడమ భుజం లాగడం వంటి లక్షణాలుంటే తక్షణమే ఆస్పత్రికి రావాలన్నారు. రోగికి యుద్ధప్రాతిపదికన ప్రాథమిక పరీక్షలు చేసి స్టెమి గుండెకు భరోసా కార్యక్రమంలో భాగంగా రూ.45 వేల ఖరీదు చేసే టెనెక్టెప్లెస్ ఇంజక్షన్ చేస్తే రోగిని బతికించే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ సదుపాయాన్ని ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు పి.ఉష, గోపీకృష్ణ, దుర్గా కల్యాణి, ఏవో డి.రవిరాజ్, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'సర్వహిత' ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ

అగనంపూడి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడకలోని సర్వహిత చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులైన 65 మందికి ప్రతినెలా మాదిరిగానే ఒక్కొక్కరికి రూ.200 చొప్పున పింఛన్లను అందజేశారు. అలాగే పలు పేద కుటుంబాలకు నిత్యావసర సరకులను అందించారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధులు మాట్లాడుతూ ఆదపలో ఉన్న పేదలను ఆదుకోవడమే ధ్యేయంగా ట్రస్టు సేవా కార్యక్రమాలను చేపడుతుందన్నారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు గుదే సుశీల గజేంద్రరావు, పట్టా రామఅప్పారావు, మస్తాన్ రెడ్డి, జి.నరసింగరావు, గణేశ్, వెంకటరమణ, వరలక్ష్మి, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇ-దర్శన్ భాగ్యం కలిగేనా?

సామాన్యులకు దూరమవుతున్న ఏడుకొండల వెంకన్న

- కొవిడ్ సమయంలో కౌంటర్ల మూసివేత
- ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- గతంలో నగరంలోనే దర్శనం, వసతి టికెట్లు లభ్యం
- కౌంటర్లు నిలిపివేయడంతోనే తిరుపతిలో పెరిగిన రద్దీ
- మళ్లీ తెరవాలని భక్తుల డిమాండ్

(ఎంవీపీ కాలనీ, ఆంధ్రజ్యోతి)

రానురాను సామాన్యులకు తిరుమల వెంకటేశ్వరు దర్శనం దుర్లభమవుతోంది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడిచే కల్యాణ మండపాల్లో ఏర్పాటు చేసిన ఇ-దర్శన్ కేంద్రాలను మూసివేయడంతో ఈ పరిస్థితి ఎదురవుతోంది. గతంలో ఇక్కడి నుంచి స్వామివారి దర్శనం టికెట్లు, వసతి గదులు లభ్యమయ్యేవి. రైలు, బస్సు, విమాన ప్రయాణాలు ఖరారైన వారి ఆయా తేదీల్లో అందుబాటులో ఉన్న సమయానికి ఈ టికెట్లను పొంది, వెంకన్నను కనులారా దర్శించుకునేవారు. అయితే కొవిడ్ సమయంలో మూతపడిన ఈ కేంద్రాలను తిరిగి తెరవడంపై గత ఐదేళ్లుగా పాలవర్గాలు, ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ప్రస్తుతం టీటీడీ వెబ్‌సైట్‌లో టికెట్లు లభ్యమవుతున్నా, నిర్దిష్ట సమయం మించిపోతే అంతే సంగతి. దీనిని కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారు. ముందుగానే టికెట్లు బుక్ చేసుకుని, బ్లాక్‌లో అమ్ముతున్నారు. పైగా కొన్ని సమయాల్లో టిక్కెట్లకు చాలా ఇబ్బంది ఎదురవుతోంది. గతంలో ఎంవీపీ కాలనీలోని హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యాలయ భవనంలోనే ఇ-దర్శన్ పేరిట టీటీడీ ఓ కౌంటర్‌ను ప్రారంభించింది. నగరం, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడికి వచ్చి, టికెట్లు కొనుగోలు చేసేవారు. దర్శనం, వసతి సౌకర్యాలకు ఇక్కడే అవకాశం లభించేవి. ఎలాంటి అదనపు చార్జీలు ఉండేవి కావు. ప్రస్తుతం కౌంటర్ లేకపోవడం వల్ల, ఆన్‌లైన్‌లో టిక్కెట్లు దొరకకక నేరుగా తిరుమలకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల తిరుపతి టికెట్ల కౌంటర్ వద్ద తొక్కిసలాటలో విశాఖకు చెందిన ముగ్గురు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఇ-దర్శన్ కౌంటర్ ఉండి ఉంటే ఆ ప్రాణాలు నిలిచేవని చెబుతున్నారు.





ఎంవీపీ కాలనీలోని ఈ భవనంలోనే ఈ దర్శన్ కేంద్రం ఉండేది



భక్తులు కూర్చోవడానికి వీలుగా కుర్చీలు

అందుకే ప్రమాదం

తిరుమలలో ముక్కోటి ఏకాదశి దర్శనానికి టికెట్ల కోసం భక్తులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కౌంటరు వద్దకు చేరుకున్నారు. తమకు దొరకవేమోనన్న కంగారుతో తోసుకోవడం, తొక్కిసలాట కారణంగా ఆరుగురు భక్తులు మృతి చెందడం దేశవ్యాప్తంగా సంచలనమయింది. చరిత్రలో లేని అపప్రద మూటకట్టుకోవాల్సి వచ్చింది. ఇ దర్శన్ కౌంటర్లు కొనసాగించి ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదని భక్తుల వాదన. ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా 2006లో ఇ దర్శన్ కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రతి రోజూ వందలాది మంది ఇక్కడ టికెట్లు కొనుగోలు చేసేవారు.

వైసీపీ ప్రభుత్వానిదే పాపం

ప్రస్తుతం జరిగిన సంఘటన గత ప్రభుత్వం చేసిన పాపంగా కొందరు భక్తులు విమర్శిస్తున్నారు. కొవిడ్ సమయంలో ఇ దర్శన్ కౌంటరును మూసివేశారు. ఆ తర్వాత తిరిగి తెరుస్తారని భక్తులు ఎదురుచూశారు. అప్పట్లోనూ ఆన్‌లైన్ టికెట్లు ఉండేవి. కానీ ఇక్కడ కచ్చితంగా టికెట్లు లభిస్తాయనే భావనతో వచ్చేవారు. కొవిడ్ సమస్య తొలగిపోయినా కౌంటర్లు తిరిగి ప్రారంభించడానికి ప్రభుత్వం చొరవ చూపలేదు. టీటీడీ కూడా పట్టించుకోలేదు.

తిరుపతి దర్శనానికి వెళ్లేవారికి బయో మెట్రిక్, ముఖ చిత్రం, ఆధార్ కార్డుల ఆధారంగా టికెట్లను జారీ చేసేవారు. ఇక్కడ రూ. 300 టిక్కెట్లు లభ్యమయ్యేవి. టికెట్‌తో పాటు గదులను బుక్ చేసుకునే అవకాశం లభించేది. ప్రతి రోజూ భక్తులతో ఈ భవనం కళకళలాడేది. స్వామివారి ఆర్జిత సేవలు రెండు నెలల ముందుగానే తీసుకునే వెసులుబాటుండేది. అనుబంధ దేవాలయాలైన తిరుచానూర్, శ్రీనివాస మంగాపురం టిక్కెట్లు, వసతి కూడా ఈ దర్శన్‌లో కొనుగోలు చేసుకునే అవకాశం ఉండేది. ముక్కోటి ఏకాదశి శ్రీవారి ఉత్తర ద్వార దర్శన టిక్కెట్లు, కల్యాణవేదిక రిజిస్ట్రేషన్, టీటీడీ క్యాలెండర్లు, డైరీలు, సప్తగిరి మాసపత్రిక విక్రయాలు, విరాళాలు, శ్రీనివాస్ ట్రస్టు దర్శన సదుపాయం అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం కళావిహీనంగా మారిపోయింది.

కౌంటర్లు తెరవాలని భక్తుల డిమాండ్

ఇ-దర్శన్ కౌంటర్లను మళ్లీ తెరవాలనే డిమాండ్ వినిపిస్తోంది.గత ఏడాది ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు దీనిపై టీటీడీ ఈవోకు లేఖరాశారు. అయినప్పటికీ అప్పటి వైసీపీ ప్రభుత్వం, అధికారులు పట్టించుకోలేదు. ప్రమాదం జరిగిన నేపథ్యంలో మరోసారి ఈ డిమాండ్ తెరపైకి వచ్చింది. ఇప్పుడైనా పాలకులు, టీటీడీ అధికారులు స్పందించాలని భక్తులు కోరుతున్నారు.

హత్యకు గురైన తహసీల్దార్ భార్యకు ప్రభుత్వ ఉద్యోగం

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దారుణ హత్యకు గురైన విజయనగరం జిల్లా బొండపల్లి తహసీల్దార్ ఎస్.రమణయ్య భార్య పోలాకి అనూషకు కారుణ్య నియామకం కోటాలో గ్రూపు-2 ప్రొబేషనరీ డిప్యూటీ తహసీల్దార్‌గా నేరుగా నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రమణయ్య విశాఖపట్నం రూరల్ తహసీల్దార్‌గా పనిచేస్తూ విజయనగరం జిల్లా బొండపల్లి బదిలీ అయినప్పటికీ కొమ్మాదిలోనే నివసించేవారు. ఇక్కడ పనిచేసినపుడు ఓ భూ వివాదానికి సంబంధించి సానుకూలంగా వ్యవహరిస్తామని ఓ వ్యక్తికి హామీ ఇచ్చి పని చేయలేకపోయారు. దాంతో సదరు వ్యక్తి గత ఏడాది ఫిబ్రవరి 2న రమణయ్య అపార్ట్‌మెంట్‌కి వెళ్లి, సెల్లార్‌లోఆయనతో మాట్లాడి, ఇనుప రాడ్‌తో తలపై కొట్టి పారిపోయాడు. రమణయ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. తల్లిదండ్రులు, ఇద్దరు చిన్న పిల్లలు ఉండడంతో ఆ కుటుంబానికి సాయం చేయాలని రెవెన్యూ అసోసియేషన్ లేఖ రాయగా, బీఎస్సీ ఉత్తీర్ణురాలైన భార్య అనూష పేరును ప్రతిపాదిస్తూ విజయనగరం కలెక్టర్ ప్రభుత్వానికి పంపారు. అన్నింటిని పరిశీలించిన ప్రభుత్వం ఆమెను జోన్-1లో డిప్యూటీ తహసీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది.

మెరుగైన పరిశోధనలకు గొప్ప అవకాశం ఐ స్టెమ్

ఏఎంటీజెడ్ ఎండీ అండ్ ఫౌండర్ సీఈవో జితేంద్ర శర్మ

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఫెసిలిటీస్ మ్యాప్ (ఐస్టెమ్)తో మెరుగైన పరిశోధనలకు అవకాశం కలుగుతుందని, ఈ పోర్టల్‌లో నమోదైన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ల్యాబ్‌ల్లో తక్కువ ఖర్చుతో నాణ్యమైన పరిశోధనలకు అవకాశం కలుగుతుందని ఏపీ మెడ్‌టెక్ జోన్ లిమిటెడ్ (ఏఎంటీజెడ్) ఫౌండర్ సీఈవో అండ్ ఎండీ జితేంద్రశర్మ పేర్కొన్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ)లో మంగళవారం ఐస్టెమ్ సహకారంతో పరిశోధకులు, పరిశ్రమలు, స్టార్టప్‌లను రీసెర్చ్ ల్యాబ్‌లతో అనుసంధానించే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశంలోని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్అండ్‌డీ) ల్యాబ్‌ల సమాచారాన్ని ఐ స్టెమ్ పేరుతో వెబ్ పోర్టల్లోకి తీసుకువచ్చి పరిశోధకులకు ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజరీ ఎంతో మేలు చేసిందన్నారు. దీనివల్ల పరిశోధకులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన పరిశోధనలు సాగించే అవకాశం కలుగుతుందన్నారు. ఏఎంటీజెడ్‌లో ఉన్న ఆర్అండ్‌డీ ల్యాబ్‌ను పరిశోధనలకు వినియోగించుకోవాలన్నారు. పెట్రోలియం ఉత్పత్తులకు సంబంధించిన పరిశోధనలపై పెట్రో వర్సిటీతో కలిసి పని చేసేందుకు ఆయన సంసిద్ధత వ్యక్తం చేశారు. ఐ స్టెమ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, నేషనల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ హరిలాల్‌భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు, పరిశోధకులు ఐ స్టెమ్ పోర్టల్‌లోని ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన మాట్లాడుతూ వర్సిటీలోని ఆర్అండ్‌డీ ల్యాబ్‌లో అత్యాధునిక పరికరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశాఖ ఫార్మా సిటీ ఎండీ, సీఈవో డాక్టర్ పీపీ లాల్‌కృష్ణ, ఆర్అండ్‌డీ డీన్ ప్రొఫెసర్ కె.విజయ్‌కుమార్, కాలేజీలు, యూనివర్సిటీల విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న జితేంద్ర శర్మ

స్టీల్‌ప్లాంటుకు ఊపిరి పోశారు.. ఊతమివ్వండి

- కేంద్ర ఆర్థికశాఖా మంత్రికి ఎంపీ శ్రీభరత్ వినతి

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణకు నిధులు కేటాయించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విశాఖపట్నం ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ విశాఖ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కర్మాగారం మరింత పురోగతి సాధించేందుకు, మౌలిక వసతుల కల్పనకు మరిన్ని నిధులు కేటాయించాలని కోరారు. ఈ మేరకు మంగళవారం ఆమెకు ఒక వినతి పత్రం అందజేశారు. ఈ నిధుల కేటాయింపు వల్ల విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఊపిరి పోసినట్టు అయ్యిందని, మరిన్ని నిధులు కేటాయిస్తే పూర్తి జవసత్వాలు వస్తాయని పేర్కొన్నారు. అలాగే మధ్యతరగతి ప్రజలకు రూ. 12 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు కల్పించినందుకు కేంద్ర ఆర్థిక మంత్రిని అభినందించారు. ఈ నిర్ణయం ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేందుకు దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.



మంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ శ్రీభరత్

జేఈఈ మెయిన్స్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులతో శ్రీచైతన్య డీజీఎం, డీన్స్

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ 2025 సెషన్ -1 జనవరి ఫలితాలలో శ్రీచైతన్య ఐఐటీ అకాడమీ ఉత్తరాంధ్ర విద్యార్థులు జాతీయస్థాయిలో ఓపెన్ కేటగిరీలో 99.999, 99994, 99.98 వంటి అత్యుత్తమ పర్సంటైల్ సాధించారని ఏజీఎం కేవీ రమణ తెలిపారు. బి.విక్రమ్‌రాజు 99.997 పర్సంటైల్, డీజీఎస్‌డీ ప్రతాప్ 99.994 పర్సంటైల్, ఎస్.హరిచరణ్ 99.98 పర్సంటైల్ సాధించారన్నారు. డీన్స్ ఎస్.రఘుకుమార్, కే.బంగారుబాబు ప్రత్యేక చొరవతో పాటు అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి, ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. 99 పర్సంటైల్‌కు పైగా 8 మంది, 98 పర్సంటైల్‌కుపైగా 37 మంది విద్యార్థులు సాధించారని పేర్కొంది. సుమారు 212 మంది విద్యార్థులు నిట్, ఐఐటీలలో సీట్లు పొందే పర్సంటైల్ సాధించడం విశేషమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ కె ధర్మరాజు, డైరెక్టర్ పి.సూర్యనారాయణ పాల్గొని ప్రతిభావంతులను అభినందించారు. సహకరించిన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీవిశ్వ విద్యార్థుల విజయకేతనం

విశాఖపట్నం: జేఈఈ మెయిన్స్-2025 ఫలితాల్లో శ్రీవిశ్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఉత్తరాంధ్రలో అత్యధిక పర్సంటైల్ సాధించారు. శ్రీవిశ్వ విద్యార్థులు అముజూరి తారక్‌రామ్ 99.87, బంటు షణ్ముఖరావు 99.78, కేవీకే నిహార్ 99.70, సీహెచ్ వెంకట హేమవర్ధన్ 99.66, జయంత్‌కుమార్ 99.44, ఎన్.మురళీ కృష్ణ 99.30, సీహెచ్ షణ్ముఖసాయి వర్మ 99.22, బి.పవన్ కుమార్ 99.11 పర్సంటైల్ సాధించారని విద్యాసంస్థల యాజమాన్యం పేర్కొంది.

శ్రీరామానుజ విద్యార్థుల ప్రతిభ

విశాఖపట్నం: పెదవాల్తేరు డాక్టర్స్ కాలనీలోని శ్రీరామానుజ జూనియర్ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో అసాధారణ ఫలితాలు సాధించారు. ఫిజిక్స్‌లో 97.057, కెమిస్ట్రీలో 99.717, గణితంలో 98.309 తమ సంస్థ సాధించిందని యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. ఐఐటీ, జేఈఈమెయిన్స్‌లో ఉత్తమ ఫలితాలు సాధించి కచ్చితమైన ప్రణాళికతో బోధించడమే కారణమని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివరామ దత్తాత్రేయ వెలగ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నరసింహారావు మృతదేహం

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి):షీలానగర్-డాక్‌యార్డు రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాత గాజువాకకు చెందిన మొదల నరసింహారావు (55) షీలానగర్ టోల్ గేటు సమీపంలో సైకిల్‌పై టీ విక్రయిస్తుంటాడు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో టోల్ గేటు సమీపంలో ఉన్న లారీ సిబ్బందికి టీ అమ్మేందుకు సైకిల్‌పై వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొంది. రోడ్డుపై పడిపోయిన అతడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

180 కేజీల గంజాయితో 8 మంది అరెస్టు



స్వాధీనం చేసుకున్న గంజాయితో డీసీపీ, తదితరులు

మహారాణిపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి గంజాయి తెచ్చి అమ్ముతున్న 8 మంది సభ్యుల ముఠాను అరెస్టు చేసినట్టు డీసీపీ మేరీ ప్రశాంతి తెలిపారు. కమిషనరేట్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఉదయం 7 గంటల సమయంలో గాజువాక కణితి రోడ్డు వుడా కాలనీ వద్ద ఓ ఇంట్లో గంజాయి ఉందన్న సమాచారంతో టాస్క్‌ఫోర్సు, గాజువాక పోలీసులు సోదా చేయగా 94 ప్యాకెట్లలో 180 కిలోల గంజాయి బయటపడింది. దీనిని నగరంలో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఎనమిది మంది సభ్యులను పట్టుకున్నామన్నారు., వారిలో గాజువాకకు చెందిన ఇమ్రాన్‌ఖాన్, రాజస్థాన్‌కు చెందిన అర్జున్‌కుమార్, ఒడిశావాసులు బిదేశీ కుమార్‌సాహు, ధామా ఖరా, శంక్రమతం, రామచంద్ర సీషా, మనోజ్ ఖేముండు, కోరాడ బాలాజీ కృష్ణలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు డీసీపీ పేర్కొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం: రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని అతని వద్ద నుంచి ఆరు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. జీఆర్పీ ఎస్ఐ ఎస్.రామారావు, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ జె.టి.నాయుడు తనిఖీలు చేస్తుండగా కృష్ణా జిల్లాకు చెందిన పాపగంటి జోసఫ్ పట్టుబడ్డాడని తెలిపారు.

గొల్లలపాలెంలో అర్ధరాత్రి పోలీసుల హల్‌చల్

భీమునిపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక గొల్లలపాలెంలో సోమవారం అర్ధరాత్రి ఒడిశా, విజయనగరం పోలీసులు హల్‌చల్ చేశారు. రెండున్నర గంటల ప్రాంతంలో సుమారు 20 మంది పోలీసులు ఒక ఇంటిని చుట్టుముట్టారు. మొదటి అంతస్థులో ఉన్న దంపతులను అదుపులోకి తీసుకున్నారు. మూడో వ్యక్తిని విడిచిపెట్టారు. వారికి స్థానిక పోలీసులు సహకరించారు. ఒడిశాలో ఓ ప్రజాప్రతినిధి ఇంట్లో భారీ చోరీ జరిగిందని, రూ.కోట్ల విలువైన బంగారు, వెండి వస్తువులు అపహరణకు గురవగా, అందులో ఈ దంపతుల హస్తం ఉందని తెలియడంతో వారిని తీసుకెళ్లినట్లు భోగట్టా. కొంతకాలంగా వీరు ఇక్కడ అద్దెకు ఉంటున్నారని స్థానికులు తెలిపారు.

దోపిడీ కేసులో నిందితుల అరెస్టు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ కాలనీ అప్పు ఘర్ వద్ద దోపిడీకి పాల్పడిన ఇద్దరిని ఎంవీపీ నేర విభాగం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో షేక్ షహిదుల్లా ఎంవీపీ కాలనీ ఏపీ టూరిజం పార్కింగ్ వద్ద నిలబడగా, అప్పుఘర్ ప్రాంతానికి చెందిన పేర్ల రఘు(19), నీలు నవదీప్ అలియాస్ నాని(20 వచ్చి షహిదుల్లాపై దాడి చేసి, రూ.2 వేలు నగదు దోచుకున్నారు. ఎస్ఐ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1,200 నగదు స్వాధీనం చేసుకున్నారు.

900 కిలోల రేషన్ బియ్యం, ఆటో స్వాధీనం

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వడ్లపూడి నుంచి సబ్బవరం కోళ్ల ఫారాలకు రేషన్ బియ్యం తరలిస్తున్న ఎస్.రవి (36)ని దువ్వాడ పోలీసులు కూర్మన్నపాలెం వద్ద మంగళవారం పట్టుకున్నారు. 900 కిలోల బియ్యాన్ని తరలిస్తున్న పాసింజర్ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. పెదగంట్యాడ ప్రాంతంలోరేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి వాటిని సబ్బవరంలోని కోళ్ల ఫారాలకు విక్రయిస్తుంటాడని ఎస్ఐ డి.శ్రీనివాసరావు తెలిపారు.

దాకమర్రి వద్ద దారి దోపిడీ

భీమునిపట్నం రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తగరపువలస సమీపంలోని దాకమర్రి జాతీయ రహదారిపై దారిదోపిడీ జరిగింది. దుండగులను భీమిలి పోలీసులు పట్టుకున్నట్టు సమాచారం. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో లీలా వరప్రసాద్, స్నేహితులు దాకమర్రి రఘు కాలేజి రోడ్డులో ప్రయాణిస్తున్నారు. దాకమర్రి సమీపంలో బైకులు ఆపారు. అదే సమయంలో ఇద్దరు పల్సర్ బైకుపై వచ్చి వారిని భయపట్టి రూ.వెయ్యి లాక్కున్నారు. అక్కడితో సంతృప్తి చెందక మరో రూ.5 వేలు తీయాలని, లేవంటే ముగ్గురిలో ఒకరు వెళ్లి తేవాలని బెదిరించారు. ఆ వ్యక్తి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. పోలీసులు ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. దీనిపై ఎస్ఐ సూర్యప్రకాష్ వద్ద ప్రస్తావించగా ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పర్యాటక బోట్ల టికెట్ల జారీలో అక్రమాలపై ఫిర్యాదు

- బోట్లు నిలిపివేసి విచారణ జరిపిన అధికారులు



రుషికొండ తీరంలో నిలిపివేసిన బోట్లు

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రుషికొండ బీచ్‌లో పర్యాటక శాఖ ఆధ్వర్యాన ప్రైవేటు సంస్థ నడుపుతున్న బోట్ల టికెట్ల అమ్మకంలో కుంభకోణం జరుగుతున్నట్టు అందిన ఫిర్యాదుపై మంగళవారం విచారణ చేపట్టారు. బోట్లు ఎక్కడానికి కౌంటర్‌లో టికెట్లు ఇచ్చేటపుడు మిషన్‌లో క్యూఆర్ కోడ్ చూపించకుండా, వేరొక కోడ్‌ను స్కానింగ్ చేయిస్తున్నారని, దాంతో ఆ మొత్తం పక్కదోవ పడుతున్నదని ఫిర్యాదు అందింది. దీనిపై ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ రమణ, డివిజనల్ మేనేజర్ జగదీశ్ మంగళవారం రుషికొండ వెళ్లి బోట్లను నిలిపివేసి విచారణ నిర్వహించారు. పర్యాటక శాఖ ఇచ్చిన టికెట్ మిషన్‌లో క్యూఆర్ కోడ్ పనిచేయడం లేదని గుర్తించారు. దాంతో ప్రైవేటు ఏజెన్సీ క్యూఆర్ కోడ్‌ను స్కానింగ్ చేయిస్తున్నారని, దానికి రశీదులు ఇస్తున్నట్టు గమనించారు. రికార్డులు సక్రమంగా ఉన్నాయని తేల్చారు. దీనికి ముందు అవకతవకలు జరిగినట్టు తేలితే అక్కడ పనిచేస్తున్న ముగ్గురు సిబ్బందిని బదిలీ చేస్తామని హెచ్చరించారు. లెక్కలు సరిపోవడంతో సాయంత్రం బోట్లను మళ్లీ రైడింగ్‌కు అనుమతించినట్టు డీవీఎం జగదీశ్ తెలిపారు.

ప్రతి బుధవారం కస్టమ్స్, జీఎస్‌టీ గ్రీవెన్స్

విశాఖపట్నం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కస్టమ్స్, జీఎస్‌టీ కార్యాలయంలో వ్యాపారులు, పరిశ్రమ వర్గాల సమస్యల పరిష్కారం కోసం ప్రతి బుధవారం గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్టు అదనపు కమిషనర్ ఎం.శ్రీకాంత్ తెలిపారు. అపాయింట్‌మెంట్ లేకుండానే ఆయా విభాగాల్లో సీనియర్ అధికారులను కలిసి సమస్య చెప్పుకోవచ్చునన్నారు. వచ్చేవారు ముందుగానే ఆ సమస్య ఎక్కడ ఏర్పడింది? ఎక్కడ ఆగిపోయింది? అనే విషయాలు రాతపూర్వకంగా తెస్తే త్వరగా పరిష్కరిస్తామన్నారు.

మన్యం బంద్ ప్రశాంతం

పాడేరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మన్యం బంద్ మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు 1/70 చట్టంపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వైసీపీ, సీపీఎం ఆధ్వర్యంలో ఏర్పడిన అఖిలపక్షం ఈ బంద్ నిర్వహించింది. బంద్ కారణంగా ఆర్టీసీ బస్సులు ప్రైవేటు వాహనాలు తిరగలేదు. పర్యాటక ప్రాంతాలు మూతపడ్డాయి. పాడేరులో ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్సీ రవిబాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, సీపీఐ నేత రాధాకృష్ణ తదితరులు బంద్‌ను పర్యవేక్షించారు.